ఆశాలపై ఉక్కుపాదం

ఆశా వర్కర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. గృహ నిర్బంధాలు, అరెస్టులు కొనసాగాయి. విజయవాడ మహాధర్నాకు వెళ్లకుండా పోలీసులు, ఆశాలు ఎక్కడికక్కడే నిర్బంధించారు. జిల్లా వ్యాప్తంగా ఆశాల వర్కర్లపై నిఘా పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. మహాధర్నాకు బస్సుల్లో వెళ్తున్న వారిని కిందకు దించి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. పోలీసులను తప్పించుకుని వెళ్లిన వారిని ఏలూరు కలపర్రు టోల్‌గేట్ వద్ద నిలువరించి నిర్బంధించడంతో ఆశాలు ఆందోళనకు దిగారు.





ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లను ఈడ్చుకెళ్తున్న పోలీసులు.. కైకలూరులో బస్సులో ఆశా వర్కర్లు

ఏలూరు క్రైం/ ఏలూరు టూటౌన్/పెదపాడు/ నూజివీడు టౌన్/కైకలూరు, ఫిబ్రవరి 8 : జిల్లాలో విజయవాడ మహాధర్నాకు వెళ్లకుండా బుధవారం నుంచే జిల్లాలోని ఆశాలపై పోలీసుల నిర్బంధకాండ కొనసాగింది. బుధవారం రాత్రి నుంచి వివిధ మార్గాల్లో విజయవాడ వెళ్లడానికి బయలుదేరగా ఎస్పీ మేరీ ప్రశాంతి పర్యవేక్షణలో జిల్లా పోలీస్ యంత్రాంగం బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రధాన రహదారుల్లో తనిఖీలు చేపట్టారు. ఎస్పీ అర్ధరాత్రి ఏలూరు నగరంలో కొత్త బస్టాండ్, పలు ప్రాంతాల్లో స్వయంగా పరిశీలించి తనిఖీలు చేయించారు. ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చి ఇంట్లో నుంచి బయటకు రాకుండా నిర్బంధించారు. పలుచోట్ల ఆశాలను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. మహిళలన్న కనికరం లేకుం డా రాత్రుళ్ల అరెస్టులు చేశారు. కలిదిండి, ముదినేపల్లి, మండవల్లిలో ఆశా వర్కర్ల నిర్బంధం కొనసాగింది. భీమడోలు, చింతలపూడిలో ఆందోళనలు, నిరసనలు కొనసాగించారు. ఇతర జిల్లాల నుంచి విజయవాడ చేరుకున్న ఆశా వర్కర్లను బస్సుల్లో ఎక్కించుకుని వచ్చి కలిదిండిలో కల్యాణి ఫంక్షన్ హాలులో నిర్బంధించారు. మండవల్లిలో శుభం కల్యాణ మండపంలో నిర్బంధించారు. వీరంతా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, కాకినాడ, జిల్లాల నుంచి వచ్చిన ఆశా వర్కర్లు. ఏలూరు సీఐటీయూ కార్యాలయానికి చేరుకున్న అంగన్‌వాడీలను అక్కడే నిర్బంధించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్‌ను కార్యాలయంలోనే నిర్బంధించారు. కొంతమంది ఆశా వర్కర్లను టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిర్బంధించిన ఆశా వర్కర్లను విడుదల చేయాలని మిగిలిన ఆశాలు ధర్నా నిర్వహించారు. సీఐ ఎం.ప్రభాకర్, ఎస్‌ఐ సాధిక్‌ల ఆధ్వర్యంలో నాయకులను అరెస్టు చేయగా మిగిలిన వారిని అక్కడ నుంచి తరిమేశారు. ఏలూరు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో 10 మందిని, టూటౌన్‌లో 24 మందిని, త్రీ టౌన్‌లో 30 మందిని, రూరల్ పోలీస్ స్టేషన్‌లో 16 మందిని అరెస్టు చేసి ఉంచారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ న్యాయంగా కనీస వేతనాలు అమలు చేయమంటే ప్రభుత్వం పోలీసులు ఇంత నిరంకుశంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ విజయలక్ష్మి మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఆశాలపై దుర్మార్గంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు టూటౌన్ పోలీస్‌స్టేషన్, సీఐటీయూ కార్యాలయంలో, కలపర్రు టోల్‌గేట్ వద్ద నిర్బంధంలో ఉన్న ఆశాలకు కనీసం తాగడానికి నీరు, ఆహారం ఇవ్వకపోవడంపై మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు, ఆహారం రప్పించి వారికి అందజేశారు. నూజివీడు పట్టణ పోలీసులు గురువారం తెల్లవారు జామునుంచి ఆర్టీసీ బస్సుల్లో తనిఖీలు నిర్వహించి ఆశాలను తొలుత నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు అక్కడి నుంచి నూజివీడు సారథి ఇంజినీరింగ్ కళాశాలకు తరలించి నిర్బంధంలో ఉంచారు. వీరితో పాటు విజయవాడకు వెళ్లిన శ్రీకాకుళం, విజయనగరం, ఒంగోలు తదితర ప్రాంతాలకు చెందిన ఆశాలను ప్రత్యేక బస్సుల్లో ఇక్కడకు తరలించారు. తమను కళాశాలకు తరలించే క్రమంలో పోలీసులు కనీస మానవత్వాన్ని సైతం మరిచారని ఆశా వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఆకలిదప్పికలు తీర్చుకునే పరిస్థితి లేకుండా మూత్రవిసర్జనకు వెళ్లాలని చెప్పినా వినకుండా బస్సుల్లో విజయవాడ నుంచి హనుమాన్‌జంక్షన్, ఏలూరు,నూజివీడుకు బస్సుల్లో తిప్పడం పై ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఈ క్రమంలో నూజివీడు పట్టణ సీఐ ఎం.వి.వి.ఎస్.ఎన్ మూర్తి, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నరసింహకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఆ క్రమంలో నరసింహను సీఐ బయటకు తోసుకుంటూ రాగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కైకలూరు టౌన్ పోలీసుస్టేషన్లో వివిధ జిల్లాలకు చెందిన 58 మంది ఆశా వర్కర్లను విజయవాడ నుంచి తరలించి నిర్బంధించారు. కైకలూరు మండల ఆశా వర్కర్లను ముందస్తుగానే పోలీసుస్టేషన్‌కు తరలించారు.



నూజివీడు సారథి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్బంధంలో ఆశాలు

విజయవాడ మహాధర్నాకు వెళ్లకుండా ఆటంకాలు

- గృహ నిర్బంధాలు.. అరెస్టులు
- కలపర్రు టోల్‌గేట్ వద్ద విస్తృత తనిఖీలు
- విజయవాడలో పలువురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- బస్సుల్లో తిప్పుతూ నూజివీడు, కైకలూరుకు తరలింపు
- తాగేందుకు మంచినీళ్లూ ఇవ్వలేదంటూ ఆశాల ఆవేదన



కలపర్రు టోల్‌గేట్ వద్ద రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఆశాలు



ముదినేపల్లి వద్ద ఆర్టీసీ బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు



ఏలూరు కొత్త బస్టాండ్‌లో ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి



కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు





కొయ్యలగూడెం, భీమడోలు పోలీస్‌స్టేషన్ల వద్ద ఆశా వర్కర్ల నినాదాలు



ముసునూరు పోలీస్‌స్టేషన్ వద్ద నినాదాలు చేస్తున్న ఆశా వర్కర్లు

జగనన్న దగా.. డీఎస్సీ

ఇది ఎన్నికల స్టంట్ : సీఎంపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఫైర్

అధికారమిస్తే తొలి సంతకం డీఎస్సీకే..

డబ్బులు తీసుకున్నా.. ఓటు మాత్రం మంచి పార్టీకే వేయండి.. పోతునూరు సభలో పిలుపు

ఏలూరు/దెందులూరు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):'వైఎస్సార్ బతికుంటే పోలవరం పూర్తయ్యేది. 20 లక్షల ఎకరాలకు నీళ్లం దేవి' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. వైఎస్సార్ పుణ్యమాని వేలాది మంది ఇంజనీర్లు, డాక్టర్లుగా ఉద్యోగాలు చేసుకుంటుంటే, ఇవాళ 19 లక్షల మంది ఉద్యోగాల్లేక రూ.5-10 వేలకు అందిన పని చేసుకుంటున్నారు. 35 వేల డీఎస్సీ ఖాళీలుంటే, ఆరు వేలతో దగా డీఎస్సీ విడుదల చేస్తారా ? ఇది ఎన్నికల స్టంట్ కాక మరేంటి? కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నా తొలి సంతకం డీఎస్సీపైనే పెడతాను' అని అన్నారు. దెందులూరు నియోజకవర్గం పోతునూరులో గురువారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. '2019 ఎన్నికలకు ముందు అప్పటి సీఎం చంద్రబాబు డీఎస్సీ ప్రకటించారు. 25 వేల ఖాళీలుంటే ఇదేం డీఎస్సీ ? అంటూ ఇదే జగనన్న ఎద్దేవా చేశారు. మరి ఇప్పుడు ఏమయ్యాయి ఆ 25 వేల పోస్టులు ? 35 వేల ఖాళీలు కళ్ల ముందుంటే, కేవలం ఆరు వేల పోస్టులతో డీఎస్సీ విడుదల చేసిన ఈ రాష్ట్ర ప్రభుత్వం, ఒక మెగా డీఎస్సీగా చెప్పుకుంటోంది. అది మెగా కాదు, దగా డీఎస్సీ. కేవలం ఎన్నికల స్టంట్ కింద మాత్రమే వైసీపీ ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. నేను హామీ ఇస్తున్నా, నాతో సహా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ అనుబంధ శక్తులతో కలిసి ఈ వైసీపీ ఎమ్మెల్యేల, మంత్రుల ఇళ్ల ముట్టడిస్తాం. వైఎస్సార్ బిడ్డగా నేను ఒక్కటే చెబుతున్నా, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నా తొలి సంతకం డీఎస్సీ నోటిఫికేషన్‌కే పెడతాను. రాహుల్‌గాంధీ ప్రధాని అయిన తర్వాత ఆయన తొలి సంతకం ప్రత్యేక హోదాపైనే చేయించుకుంటాం. వైఎస్సార్ పోయాక ఒక్కరూ కూడా సరిగా పనిచేయలేదు. రైతు చనిపోతే ఈ రాష్ట్రంలో బీమా కల్పించే దిక్కు లేదు. ఆయనే బతికుంటే పోలవరం ద్వారా 20 లక్షల ఎకరాలకు నీరందించేవారు. ఇదేనా రాజన్న రాజ్యం? ఇదేనా ఆయన ఆశయాలు సాధించే మార్గం? కేవలం వైఎస్సార్ ఆశయాల సాధనకే నేను బాధ్యతతో నా పుట్టింటి వంటి ఏపీకి వచ్చాను. ఈ రాష్ట్రానికి హోదా వచ్చే వరకు నేను కదలను, రాజధాని పూర్తయ్యేవరకు వెళ్లను. పోలవరం పూర్తయ్యేవరకు విడిచి పెట్టను' అని అన్నారు.



పోతునూరు సభలో మాట్లాడుతున్న షర్మిల...



షర్మిలకు గజమాలతో స్వాగతం

ఇది ఎన్నికల సమయం

'అమ్మా! ఇది ఎన్నికల సమయం. ఐదేళ్లకు ఒకసారి వచ్చే సమయం. ఓట్ల కోసం అందరు నాయకులూ వస్తారు, డబ్బులు ఇస్తారు. ఎవరెవరు ఎంతెంత ఇచ్చినా తీసుకోండి పర్లేదు. శాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా నాయకులు ఏమిచ్చినా వద్దనకండి. కానీ, ఓటు మాత్రం మీ ఆలోచన అయి ఉండాలి. మంచి పార్టీకే ఓటు వేయండి. మీకు ఎవరైతే మంచి చేశారో వాళ్లకే మద్దతివ్వండి. టీడీపీని చూశారు, వైసీపీకి ఒక్క ఛాన్స్ ఇచ్చి మోసపోయారు' అంటూ పేర్కొన్నారు. ఢిల్లీ వెళ్లి హోదా అడిగానని కబుర్లు చెప్పే జగన్‌ను దీటుగా ప్రశ్నించగల సత్తా ఒక్క షర్మిలకే ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ అన్నారు. షర్మిల రాకతో కాంగ్రెస్‌కు కొత్త కళ వచ్చిందని, ఈ రోజు మహిళలందరూ మన పార్టీ వైపే చూస్తున్నారన్నారు. మన గ్రామానికి రావాలని అడిగిన వెంటనే అనారోగ్యంతో ఉన్నా సరే, పట్టించుకోకుండా పోతునూరు వచ్చారని నియోజకవర్గ నాయకుడు డీవీఆర్కే చౌదరి తెలిపారు. జెట్టి గుర్నాథరావు తదితరులు మాట్లాడారు.

ఆలస్యంగా రాక

కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందుగా నిర్ణయించుకున్న సమయం కంటే షర్మిల రాక ఆలస్యమవడంతో షెడ్యూల్‌లో నిర్ణయించుకున్న బస్సు యాత్రను బహిరంగ సభతో ముగించారు. షర్మిల అనారోగ్యం కారణంగా గుంటూరు జిల్లా నుంచి ఆమె రాక ఆలస్యం కావడంతో షెడ్యూల్లో పలు మార్పులు జరిగాయి. సాయంత్రం ఐదు గంటలకు సత్యనారాయణపురం చేరుకోవాల్సి ఉండగా, ఆరు గంటల సమయంలో అక్కడకు చేరుకున్నారు. దీంతో యాత్రను రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్న నాయకులు, నేరుగా ఆమెను సభ ఏర్పాటు చేసిన పోతునూరులోని గాంధీ బొమ్మ సెంటర్ వద్దకు తీసుకెళ్లారు. ఆమె వచ్చిన పది నిమిషాల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఆమెను చూసేందుకు, సెల్ఫీలు దిగేందుకు మహిళలు పోటీ పడ్డారు.

తూతూ మంత్రంగా..

- ఆక్వా జోన్ అనుమతుల మంజూరులో జాప్యంపై కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు
- ముందస్తు సమాచారం లేకుండా ఆర్డీవో విచారణ
- రైతుల నుంచి విమర్శలు.. న్యాయం జరగలేదంటూ ఆవేదన

కైకలూరు, ఫిబ్రవరి 8: ఆక్వా, నాన్ ఆక్వాజోన్‌ల రైతులకు మంజూరు చేసే అనుమతులు సక్రమంగా ఇవ్వడం లేదని వచ్చిన ఫిర్యాదులపై విచారణ అంతంతమాత్రంగానే నిర్వహించారని ఆక్వా రైతులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. కలిదిండి మండలంలో పలువురు రైతులు ఆక్వా, నాన్ ఆక్వాజోన్ పరిధిలో అనుమతులు కోసం మత్స్యశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకుని ఆరు నెలలు గడిచినా అనుమతులు మంజూరు చేయడం లేదని కైకలూరు మత్స్యశాఖ ఏడీ చాంద్‌బాషాపై గతనెల 28వ తేదీన జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఏలూరు ఆర్డీవో ఖాజావలిని దీనిపై విచారణ జరపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం విచారణ జరిపారు. అయితే ఫిర్యాదు చేసిన రైతులు, అనుమతులు కోసం దరఖాస్తు చేసిన రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆర్డీవో విచారణకు వస్తున్నట్టు అప్పటికప్పుడు సమాచారం ఇచ్చి తూతూమంత్రంగా విచారణ చేశారని రైతులు మండిపడుతున్నారు. ఉదయం 10.30 గంటలకు ఆర్డీవో వస్తున్నట్టు సమాచారం ఇచ్చి అరగంటలో కైకలూరు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాలని ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులు రైతులకు సూచిం చారు. ఈ క్రమంలో ఇద్దరు రైతులు మాత్రమే ఆర్డీవో విచారణకు హాజరయ్యారు. కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో రైతులను, మత్స్యశాఖ ఏడీ చాంద్‌బాషాను ఒకే చోట సమావేశపరిచి విచారణ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ జరపాల్సి ఉండగా పక్క మండలంలో నాలుగు గోడల మధ్య విచారణ చేయడం గమనార్హం. ఉన్నతాధికారులైనా న్యాయం చేస్తారని వారి దృష్టికి తీసుకువెళ్తే నామమాత్రంగా విచారణ చేయడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేస్తున్న ఆర్డీవో ఖాజావలి

అప్పటికప్పుడు సమాచారం ఇచ్చారు..

ఆక్వాజోన్ అనుమతుల కోసం ఆరు నెలలు కిందట దరఖాస్తు చేసుకున్న నేటికీ ఇవ్వలేదు. గ్రామ మత్స్యశాఖ అధికారి, మండల మత్స్యశాఖ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి గతంలో అనుమతులు ఇచ్చారు. ప్రస్తుతం మత్స్యశాఖ ఏడి క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తేనే అనుమతులు వస్తాయంటూ నెలల తరబడి కాలయాపన చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. ముందస్తుగా సమా చారం ఇవ్వాల్సిండగా గురువారం ఉదయం 10.30 గంటలకు ఫోన్ చేసి అరగంటలో కైకలూరు తహసీల్దార్ కార్యాలయంలో విచారణకు రావాలని సమాచారం ఇచ్చారు. ఆర్డీవో విచారణకు వెళ్లినా మాకు న్యాయం జరగలేదు.

- బెల్లంకొండ వెంకన్నబాబు, మూలలంక

ఆరునెలలుగా అనుమతులు ఇవ్వలేదు

నాకు, నా తండ్రికి మొత్తం మూడున్నర ఎకరాల రొయ్యల చెరువు ఉంది. అనుమతులు కోసం దరఖాస్తు చేసుకుని ఆరు నెలలు గడుస్తోంది. ఇంతవరకు అనుమతులు ఇవ్వలేదు. కనీసం క్షేత్రస్థాయిలో చెరువు వద్దకు వచ్చి మత్స్యశాఖ అధికారులు పరిశీలన చేయలేదు. డబ్బులు ఇచ్చిన వారికి ముందుగా అనుమతులు ఇస్తున్నారు.

- ముద్దం పాండురంగారావు, పెదలంక

జాతీయ రహదారి పెండింగ్ అంశాలపై సమీక్ష

ఏలూరు, కలెక్టరేట్, ఫిబ్రవరి 8 : నేషనల్ హైవే పెండింగ్ అంశాలపై రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో గురువారం విజయవాడ నుంచి సమీక్ష నిర్వహించి, దిశ నిర్దేశం చేశారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జేసీ బి.లావణ్యవేణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారుల పెండింగ్ అంశాలు, రెవెన్యూ, అటవీ, సంబంధిత శాఖలు వేగవంతం చేయాలని సూచించారు. రెవెన్యూ, రీసర్వే మూడో దశ, ఇనాం, అసైన్డ్‌భూములు, ఆరోగ్యం, వైద్యం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో డీఆర్వో పుష్పమణి, డీపీవో విశ్వనాథ్, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ, మునిసిపల్ కమిషనర్ వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 43మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8 : జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షకు మొత్తం 1,558 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,515 మంది హాజరయ్యారని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు.

ఆలస్యంగా నూర్పిళ్లు చేసినా ధాన్యం కొనుగోలు

జేసీ లావణ్యవేణి

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 8 : ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించి దాదాపుగా 90 రోజులు గడచిన కారణంగా, రోజువారీ కొనుగోళ్లు తగ్గిన కారణంగా కొనుగోలు ప్రక్రియ ముగించాలని నిర్ణయించా మని, రైతుల వద్ద మిగిలిఉన్న ధాన్యాన్ని ఈనెల 15వ తేదీలోగా సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్ద విక్రయించుకోవాలని జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. ఏదైనా మండలాల్లో రైతులు అపరాలు సాగు చేస్తున్న కారణంగా వరి కుప్పలు, నూర్పిళ్లు చేయడం ఆలశ్యమైతే ఆ మిగులు ధాన్యాన్ని రబీ సీజన్‌లో లేట్ ఖరీఫ్ కింద కొనుగోలు చేయడానికి ప్రతిపాదనలు సంబంధిత అధికారులకు పంపిస్తామని, రైతులు ఆందోళన చెంద వద్దని తెలిపారు. జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి ఈనెల 7వ తేదీ నాటికి 41,570 మంది రైతుల నుంచి రూ.712.17 కోట్లు విలువైన 3,26,005 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఇప్పటివరకు రూ. 657.85 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేయగా మిగిలిన రూ.53.59 కోట్లు బ్యాంక్ వద్ద జమ చేసే ప్రక్రియలో ఉందన్నారు.



వంటలు సిద్ధం చేస్తున్న భక్తులు, సిబ్బంది

నేడు మావుళ్లమ్మ ఆలయం వద్ద అన్న సమారాధన



ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

భీమవరం టౌన్, ఫిబ్రవరి 8 :మావుళ్ళమ్మ అఖండ అన్నసమారాధన శుక్రవారం ఉదయం ఘనంగా నిర్వహించేందుక నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, మావుళ్ళమ్మ ఉత్సవ కమిటీ ఏర్పాట్లను పూర్తిచేసింది. అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించేందుకు వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయం అన్ని వైపులా మార్గాలను మూసివేశారు. తహసీల్దార్ కార్యాలయం రోడ్డు నుంచి లోపలికి వచ్చేలా ఏర్పాటు చేశారు. డీఎస్పీ నారాయణ స్వామి రెడ్డి కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. సాయంత్రం నుంచి ఆలయం వద్ద వంటలు వండే కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది నిమగ్నమయ్యారు.

ద్వారకాతిరుమల ఆలయ డిప్యూటీ ఈవోగా బాబూరావు



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 8: చినవెంకన్న ఆలయంలో డిప్యూటీ ఈవోగా బాబూరావు గురు వారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కాకినాడ ఎంఎస్ఎన్ ఛారి టీస్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు.

మావుళ్ళమ్మ ఈవోకు డీసీగా పదోన్నతి

భీమవరం టౌన్, ఫిబ్రవరి 8 : మావుళ్ళమ్మ దేవస్థానం సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్న యర్రంశెట్టి భద్రాజీకి డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి వచ్చింది. అనంతపురం జిల్లా కస్యపురంలో నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి డీసీగా నియమించారు. గురువారం అక్కడ బాధ్యతలు చేపట్టేందుకు వెళ్లారు. మావుళ్ళమ్మ దేవస్థానం సహాయ కమిషనర్‌గా ఇంకా ఎవరినీ నియమించలేదు. కొంతమంది ఈవోలకు అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతి వచ్చే అవకాశం ఉందని అందులో ఒకరిని ఇక్కడ నియమించే అవకాశం ఉందని చెబుతున్నారు.

దేశాభివృద్ధిలో పరిశోధనలే కీలకం

తాడేలపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 8 : దేశాభివృద్ధిలో పరిశోధనలే కీలకమని, విభిన్న రంగాలలో నూతన ఆవిష్కరణల రూపకల్పనకు అవి ఎంతగానో దోహదపడతాయని పాట్నాలోని ఐఐటీ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ జగన్నాధ్ మాలిక్ అన్నారు. ఏపీ నిట్ ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్, ఈసీఈ , సివిల్ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో ఛాలెంజెస్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ యాంటినాస్ ఫర్ వైర్‌లెస్ కనెక్టవిటీ అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా వైర్‌లెస్ కనెక్టవిటీ కోసం జరుగుతున్న విస్తృత పరిశోధనలు, వాటి ప్రాధాన్యం తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. కన్వీనర్‌గా డాక్టర్ జీఆర్‌కే.శాస్త్రి, కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్.యువరాజులు వ్యవహరించారు. ఆచార్యులు డాక్టర్ వీ.సందీప్, డాక్టర్ పీ.శంకర్, డాక్టర్ సుభాని, డాక్టర్ వి.సుదర్శనదీప తదితరులు పాల్గొన్నారు.

16 వరకూ కోర్టు విధుల బహిష్కరణ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 8 : ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును నిరసిస్తూ న్యాయవాదులు తలపెట్టిన ఉద్యమంలో భాగంగా ఈనెల 16 వరకూ కోర్టు విధులను బహిష్కరిస్తున్నట్లు ఏలూరు బార్ అసోసియేషన్ తీర్మానించింది. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ వల్ల సన్న, చిన్న రైతులకు, బడుగు, బలహీన వర్గాల రైతులకు తీరని నష్టం వాటిల్లుతుందని భూములపై పూర్తి అధికారాలు రెవెన్యూ శాఖకే అప్పగించడం వల్ల భూములు భూస్వాముల చేతిలోకి వెళ్లిపోతాయని అన్నారు. ఇప్పటికే న్యాయవాదులు ఈ యాక్టును నిరసిస్తూ ఏలూరు కోర్టు బయట రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. మరోవైపు హైకోర్టులో కూడా ఏలూరు బార్ అసోసియేషన్ తరఫున ఈ చట్టంపై పిల్ దాఖలు చేశారు. ఈనెల 16 వరకూ కోర్టు విధులను బహిష్కరించాలని ఏలూరు బార్ అసోసియేషన్ పిలుపునిచ్చింది.

పెద్దాసుపత్రికి అడ్డంకులు

జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్

నాలుగేళ్లుగా కదలికలేని భూసేకరణ



తణుకు, ఫిబ్రవరి 8: తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి అవసరమైన భూ సేకరణ కలగానే మిగిలింది. జిల్లా కేంద్ర ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తు 2020లోనే అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ళ నాని శంకుస్థాపన చేశారు. పూర్తిస్థాయి వైద్య సేవలు అందు బాటులోకి వస్తాయని అంతా భావించారు. అయితే నాలుగు సంవత్సరాలు కావస్తున్నప్పటికి భూసేకరణ విషయంలో కదలిక లేదు. ఉమ్మడి జిల్లాలోనే తణుకు ఆసుపత్రికి మంచి పేరుంది. జాతీయ రహదారికి దగ్గర్లో ఉండటం ఉభయగోదావరి జిల్లాలకు అనువుగా ఉండటం వంటి కారణాలతో పొరుగు జిల్లాల వాసులు కూడా ఇక్కడకు వైద్యం కోసం వస్తుంటారు. టీడీపీ హయాంలోనే అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న ఆరిమిల్లి రాధాకృష్ణ చొరవ తీసుకుని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తు ఉత్తర్వులను తీసుకువచ్చారు. తర్వాత వైసీసీ అధికారంలోకి వచ్చింది. తర్వాత కూడా జిల్లా కేంద్రం భీమవరం, తాడేపల్లిగూడెం, వంటి పట్టణాలు తెరమీదకు వచ్చినప్పటికి చివరకు తణుకులోనే ఏర్పాటు చేశారు. పట్టణంలో ఉన్న కేశవస్వామి, మహాలక్ష్మి అమ్మవార్లకు చెందిన పది ఎకరాల భూమిని లీజుకు తీసుకునే విధంగా నవంబరు 2020 సంవత్సరంలో అభివృద్ధి కమిటీ తీర్మానం చేసి పంపించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ ఫైలు వైద్య ఆరోగ్య శాఖ కమీషనర్ వద్ద పెండింగ్‌లో ఉందని తెలిసింది. ఈ భూమి జాతీయ రహదారికి దగ్గరగా ఉండటం వల్ల పేదలకు వైద్య సదుపాయాలకు, రవాణాకు అనువుగా ఉంటుందని భావించి ఎంపిక చేశారు.

ఉత్సవ విగ్రహాలపై మలినాలు !



యలమంచిలి, ఫిబ్రవరి 8: దొడ్డిపట్ల గ్రామంలోని కేశవస్వామి ఆలయంలో ఉత్సవ విగ్రహాలపై అగంతకులు గురువారం రాత్రి దుర్గంధంతో కూడిన పదార్థాన్ని వేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని కొందరు వ్యక్తులు గురువారం సాయంత్రం ఆలయం ద్వారానికి ఉన్న ఇనుప గ్రిల్‌కు ఉన్న తలుపుల వద్ద నుంచి ఆలయం లోపలికి దుర్గంధంతో కూడిన పదార్థాన్ని విసిరివేసి ఉంటారని భావిస్తున్నారు. ఆ పదార్థం ఉత్సవ విగ్రహాలపైన, స్వామివారి పాదుకలపైన పడి ఉంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, భజరంగ్‌దళ్ కార్యకర్తలు ఆలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. గ్రామస్తులు ఆలయ ఈవోకి తెలియజేయడంతో పాటూ, పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. ఇదే గ్రామంలోని మట్టపర్తివారిపాలెం ప్రాంతంలోని రామాలయంలో వారం రోజుల క్రితం ఇదే విధంగా జరిగిందని పలువురు స్థానికులు చెబుతున్నారు.



పాతపోలవరం వద్ద కోతకు గురైన నెక్లెస్ బండ్

నెక్లెస్ బండ్ రక్షణ గాలికి..

తాత్కాలిక పనులతో కాలక్షేపం

ఇప్పటివరకు రూ.14 కోట్లు వెచ్చించి పనులు

నిధుల వినియోగంపై స్థానికుల్లో అనుమానాలు

పోలవరం, ఫిబ్రవరి 8 : పోలవరం గ్రామానికి గోదావరి వరదల నుంచి రక్షణగా వేసిన నెక్లెస్ బండ్‌కి పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టలేదు. పోలవరం గ్రామంలో గోదావరి నది తీరంలో సుమారు 150 ఎకరాల మేర ఇసుక తిన్నెలు కొట్టుకుపోయి లంక గట్లు పూర్తిస్థాయిలో కోతకు గురయ్యాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్మించిన స్పిల్‌వే నుంచి విడుద లవుతున్న గోదావరి వరద జలాలు నేరుగా పురుషోత్తపట్నం రేవుని తాకి అదే వేగంతో పోలవరం ఏటిగట్లను, నెక్లెస్ బండ్‌ను తాకుతూ ప్రవహిస్తూ ఉండడం వల్ల నెక్లెస్‌బండ్ కోసం వేసిన నల్లబంకమన్ను అండలుగా విరిగిపడి కోతకు గురైంది. ఐదేళ్ళ క్రితం వచ్చిన వరదలకు గట్లు ప్రమాద స్థాయిలో కోతకు గురవడంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన పోలవరం ప్రాజెక్టు నుంచి రాళ్లు తెచ్చి పాతపోలవరం బోటు పాయింట్ ప్రాంతం నుంచి ఆంజనేయస్వామి ఆలయం ర్యాంపు వరకూ తాత్కాలిక రక్షణ చర్యలు చేశారు. తూతూ మంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారే గానీ శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టలేదు.మూడున్నర కిలోమీటర్ల మేర నెక్లెస్ బండ్‌కి రక్షణ చర్యలు చేయవలసి ఉండగా ఒకటిన్నర కిలోమీటర్ల మేర మాత్రమే పనులు చేసి నిలిపివేశారు. ఇప్పటి వరకూ నెక్లెస్ బండ్ నిర్మాణం కోసం విడతల వారీగా సుమారు రూ.14 కోట్లు ఖర్చు చేశారు.

నాలుగేళ్లుగా అరకొర పనులు



ఆంజనేయస్వామి గుడి రేవులో ఆగిన పనులు చూపుతున్న టీడీపీ నాయకుడు

నెక్లెస్ బండ్ నిర్మాణం కోసం తొలుత కోటి యాభై లక్షల రూపాయలతో లంక భూములను కొనుగోలు చేశారు. మూడు కోట్లతో పోలవరం ప్రాజెక్టు నుంచి తరలించిన నల్లబంక మన్నుతో నెక్లెస్ బండ్ నిర్మించారు. రాళ్ళతో రివిట్‌మెంట్ పనులు చేయవలసి ఉండగా గాలికొదిలేశారు. తర్వాత వరుసగా నాలుగేళ్లలో వచ్చిన వరదలకు గట్లు కొట్టుకు పోతుండడంతో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో నెక్లెస్ బండ్‌కి ప్రాజెక్టు నుంచి తరలించిన రాళ్లతో ఏపీ టూరిజం బోట్ పాయింట్ నుంచి సీడబ్ల్యూసీ కార్యాలయం వరకూ రూ.3 కోట్లతో కొంతమేర గట్టు వేసి వదిలేశారు. ఆ తర్వాత వచ్చిన వరదలకు ఆంజనేయస్వామి ఆలయం వరకూ గట్టు కోతకు గురవడంతో మళ్ళీ అక్కడి వరకూ రాళ్లతో గట్టు వేశారు. వేసిన గట్టు పూర్తిగా కాకుండా 10 అడుగుల దిగువ వరకూ వేసి వదిలేశారు. ఇలా విడతల వారీగా నెక్లెస్ బండ్ నిర్మాణానికి 14 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అయితే నిధుల వినియోగంపై విచారణ జరపాలని స్థానిక టీడీపీ నాయకులు మంగిన కొండ, యడ్ల వినోద్, ఆకుల రాజా, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పోశీరత్నం, పార్వతి, పట్నాల దేవి, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

వరదలు వస్తే ప్రమాదమే



నెక్లెస్ బండ్‌కి రక్షణ చర్యలు చేయకపోతే రానున్న వరదలకు కోతకు గురై గ్రామానికి వరదల నుంచి ప్రమాదం వచ్చే అవకాశం ఉంది. అధికారులు వరదల సమయాల్లో తూతూ మంత్రంగా ఇసుక బస్తాలు, తడికలు, కర్రలతో తాత్కాలిక చర్యలు చేపడతున్నారే శాశ్వత చర్యలపై దృష్టి పెట్టడం లేదు.

-మంగిన కొండ, టీడీపీ నాయకుడు

గోదాట్లో కోట్లు



నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి వద్ద కోతకు గురైన గోదావరి ఏటిగట్టు

మళ్లీ కుంగిన ఏటిగట్టు

నరసాపురం వాసుల్లో భయాందోళన

అర్ధరాత్రి ఇళ్ల నుంచి బయటకు..

రూ.28 కోట్లతో చేపట్టిన పనులకు తూట్లు

నరసాపురం, ఫిబ్రవరి 8: గోదావరి ఏటిగట్టు పనుల్లో మళ్లీ డొల్లతనం బయటపడింది. రూ.28 కోట్లతో నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి వద్ద చేపడుతున్న గట్టు గురువారం తెల్లవారుజామున కుంగిపోయింది. రాళ్లు నీళ్ళల్లోకి జారుగుతున్న సమయంలో పెద్దగా శబ్దం రావడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి బయటకొచ్చారు. మంచు, చీకటి కారణంగా కొద్దిసేపు ఏం జరిగిందో తెలియని పరిస్థితి. అయితే జారుతున్నది రాళ్లు అని తెలుసుకుని ఒక్కసారిగా ఆందోళన చెందారు. తెల్లవారుజాము వరకు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఉదయాన్నే పోలీసులు వచ్చి గట్టు మీదకు ఎవరినీ అనుమతించలేదు.

2022 జూలై నెలలో వచ్చిన వరదకు అమరేశ్వరస్వామి గుడి నుంచి బుడితల రేవు వరకు సుమారు 400 మీటర్ల మేర గోదావరి గట్టు కోతకు గురైంది. అప్పట్లో రూ.50 లక్షలు వెచ్చించి తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. 2022 నవంబర్‌లో రూ.28 కోట్లతో కోతకు గురైన గట్టు పటిష్ఠపనులకు సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో పనులు చేపట్టారు. సుమారు 100 మీటర్ల మేర రాళ్లతో గట్టును పటిష్ఠపర్చారు. ఈ పనుల్లో పెద్దఎత్తున అవినీతి జరిగిందంటూ మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు ఆరోపిస్తూ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వం తిరస్కరించిన క్వారీ నుంచి రాళ్లు తీసుకొచ్చి పనులు చేపడుతున్నారని దీనిపై విజిలెన్స్ విచారణ చేయించాలని జిల్లా కలెక్టర్, నరసాపురం సబ్ కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై ప్రభుత్వం స్పందించ లేదు. గత నెలలో ఒక్కసారిగా గట్టు కుంగిపోయింది. అప్పటి నుంచి కోతకు గురైన గట్టును పటిష్ఠం చేస్తూ వచ్చారు. అయితే ఈనెల రోజులు చేసిన పనంతా వృధా అయింది. మళ్లీ గతంలో ఎక్కడైతే కోతకు గురైందో అక్కడ వేసిన రాళ్లన్నీ నీటిపాలయ్యాయి.



విచారణ జరిపించాలి : టీడీపీ

కోతకు గురైన గట్టును టీడీపీ ఇన్‌ఛార్జీ పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడులు పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఏటిగట్టు శాఖ ఏఈ సుబ్బారావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ పనులపై వస్తున్న ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రేపు వరదల సమయంలో ఇలాంటి పరిస్థితి తలెత్తితే వచ్చే ప్రమాదానికి ఎవరు బాధ్యులు వహిస్తారంటూ ప్రశ్నించారు. జక్కం శ్రీమన్నారాయణ, పొన్నాల నాగబాబు, కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవి, బర్రె మురళీ, శశిదేవి, నాగలక్ష్మి, మల్లాడి మూర్తి తదితులు పాల్గొన్నారు

రబీ గుబులు



కోడేరు బ్యాంక్ కెనాల్‌లో అడుగంటిన నీటి మట్టం

ఇంకా పూర్తికాని వరి నారుమళ్లు

వెంటాడుతున్న వంతులవారీ కష్టాలు

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 8: రబీ వరిసాగులో జాప్యం కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలో వరి నారుమళ్లు పూర్తికాలేదు. రబీ ఆలస్యమైతే సాగునీటి ఇబ్బందులు ఏర్పడతాయోమోనన్న ఆందోళన రైతుల్లో కనిపిస్తోంది. సార్వా ధాన్యం కొనుగోళ్లు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఈ నెల 15 నాటికి ధాన్యం కొనుగోళ్ళను పూర్తిచేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. రబీకి పెట్టుబడులకు సొమ్ములు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతంతో పోలిస్తే ఈసారి రబీ విస్తీర్ణం తగ్గే అవకాశాలున్నాయని చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో రబీకి సంబంధించి 4,936 ఎకరాల్లో వరి నారుమళ్లు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం జిల్లాలో 3,746 ఎకరాల్లో మాత్రమే వరి నారుమళ్లు వేశారని చెబుతున్నారు. జిల్లాలో 98 వేల 726 ఎకరాల్లో రబీ వరి సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ నిర్ధేశించుకుంది. దీనికి సంబంధించి ఇప్పటివరకు 71,355 ఎకరాల్లో వరి నాట్లు వేశారని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి.

మొక్కజొన్నదీ అదే పరిస్థితి

మెట్టలో మొక్కజొన్న ప్రధాన పంటగా సాగు చేస్తారు. ఈ ఏడాది జిల్లాలో 1,04,261 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 57,764 (55 శాతం) ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. అపరాల సాగు విస్తీర్ణం 42,486 ఎకరాలు కాగా ఇప్పటివరకు 40,064 ఎకరాల్లో సాగు ప్రారంభమైంది.నూనెపంటల సాగులో సాధారణ విస్తీర్ణం 3029 ఎకరాలు కాగా 3,388 ఎకరాల్లో, వాణిజ్య పంటలు జిల్లాలో 32,074 ఎకరాలు కాగా 23,768 ఎకరాల్లో సాగు ప్రారంభమైంది. మొత్తం మీద రబీలో అన్ని పంటలు కలిపి సాధారణ విస్తీర్ణం 2,80,673 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 1,96,432 ఎకరాల్లో సాగు ఆరంభం అయింది.

ఆచంటలో ఇంజన్లతో నీరు

ఆచంట, ఫిబ్రవరి 8: రబీకి వంతుల వారీ విధానంలో సాగునీరు అందిస్తున్నారు. దీంతో ఆచంట మండలంలో శివారు ప్రాంతాల్లో సాగు నీటి కష్టాలు మొదలయ్యాయి. కొన్ని రోజులుగా కోడేరు బ్యాంక్ కెనాల్‌లో నీటి మట్టం పూర్తిగా తగ్గింది. దీంతో కొంతమంది రైతులు ఇంజన్ల సాయంతో తమ పొలాలకు నీటిని అందిస్తున్నారు.

క్రైం కార్నర్

రైలు నుంచి జారిపడి యువకుని మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 8 : రైలు నుంచి ఒక యువ కుడు జారిపడి మృతి చెందాడు. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన చెల్లే ఆశిష్ కుమార్ (27) విజయవాడలో ఉన్న తన మేనమామ ఇంటికి వెళ్ళే నిమిత్తం కాకినాడ పోర్టు నుంచి విజయవాడ వెళ్తున్న (రైల్ నెంబర్ 17258) రైలును గురువారం ఎక్కాడు. రద్దీ ఎక్కువగా ఉండడంతో భోగీ గుమ్మంలో నిలబడిన అతను ఏలూరు సమీపంలో ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి 108 అంబులెన్సులో తీసుకువెళ్ళగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కామవరపుకోట, ఫిబ్రవరి 8 : కామవరపుకోట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మూడు రోజుల నుంచి ఒక వ్యక్తి బిక్షాటన చేస్తూ అపస్మారక స్థితిలో బస్టాండ్ ఆవరణలోనే పడి ఉన్నాడని తడికలపూడి ఎస్ఐ జయబాబు గురువారం తెలిపారు. కొన ఊపిరితో ఉన్న ఆ వ్యక్తిని సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 108లో జంగారెడ్డిగూడెం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. వివరాలు తెలిస్తే ఎస్ఐ సెల్ నెంబర్ 9440796678 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

కట్నం వేధింపులపై ఫిర్యాదు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 8 : కట్నం కోసం వేధిస్తున్నారంటూ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. పట్టణంలోని చినరంగనిపాలెంకు చెందిన గుత్తుల ప్రమీలకు 2017లో దుర్గాప్రసాద్‌తో వివాహమైంది. పెళ్ళి సమయంలో రూ.1.20 లక్షలు కట్నంగా ఇచ్చారు. ఇటీవల అదనపు కట్నం తేవాలంటూ దుర్గాప్రసాద్ అతని కుటుంబ సభ్యులు వేధించడంతో గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ రామ్‌కుమార్

తూర్పుపాలెంలో చోరీ

రూ.75 వేల నగదు, ఉంగరం చోరీ

పోడూరు, ఫిబ్రవరి, 8 మండలంలోని తూర్పుపాలెం గ్రామంలో బుధవారం రాత్రి వేమవరపు నాగమణి ఇంట్లో చోరీ జరిగింది. తూర్పుపాలెం ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు క్యాంపు కార్యాలయం దగ్గరలో ఆమె ఇద్దరు కుమారులతో కలిసి అద్దె ఇంట్లో ఉంటుంది. పెద్దకుమారుడు అనారోగ్యం కారణంగా బంధువుల ఇంటివద్ద ఉండగా రెండో కుమారుడు ఆమె వద్దే ఉంటున్నాడు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి దగ్గరగా ఉండటంతో పది రోజులుగా నిర్వహిస్తున్న 'మనసారా ఆసరా' సంబరాలకు వంటపనులు నిమిత్తం రోజువారీ కూలీగా పనిచేస్తోంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి వంట పనులు చేసి ఇంటికి వెళ్లగా ఇంటిలో వస్తువులన్నీ చిందరవందరగా, బీరువా తాళాలు పగటుకొట్టి ఉండటంతో చోరీ జరిగిందని నాగమణి గుర్తించింది. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి చెప్పి బోరుమంది. బీరువాలో ఉన్న రూ.75 వేలు నగదు, అరకాసు బంగారు ఉంగరం చోరీకి గురైనట్లు నాగమణి తెలిపింది. చోరీకి గురైన ప్రాంతాన్ని ఎస్ఐ రామ్ కుమార్ పరిశీలించారు. వేలిముద్రల నిపుణులతో పరిశీలించారు.

మూడు ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం..రాగివైరు చోరీ



పెదవేగి, ఫిబ్రవరి 8 : పొలాల్లో వ్యవ సాయ మోటార్ల దగ్గర విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ధ్వంసం చేసి, అందులోని రాగి వైరును దుండగులు చోరీ చేస్తున్నారు. పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగికి చెందిన ఉండవల్లి రాము, పరసా సీతామహాలక్ష్మి, పొట్నూరి దుర్గాదేవి అనే రైతులకు చెందిన మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, అందులో ఉండే రాగివైరును తీసుకెళ్ళి పోయారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్‌లో సుమారు రూ.15 వేలు విలువైన రాగి వైరు ఉంటుందని, మూడు ట్రాన్స్‌ఫార్మర్లలో రూ.45 వేలు విలువైన రాగి వైరు చోరీకి గురైందని ఎస్ఐ చెప్పారు. పెదవేగి విద్యుత్ ఉపకేంద్రం ఏఈ నాగేషుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసునమోదు చేశామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

ఇరువర్గాల కొట్లాట..ఒకరిపై ఒకరు ఫిర్యాదులు

ఆకివీడు, ఫిబ్రవరి 8: పాత తగాదాల నేపథ్యంలో ఇరు వర్గాల కొట్లాటలో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవడంతో ఎస్ఐ బత్తిన నాగబాబు కేసులు నమోదు చేశారు. కోళ్ళపర్రు గ్రామంలో రొయ్యల చెరువు దగ్గర నడక దారి విషయంలో పాసం నర్సింహమూర్తి, పాసం విష్ణుమూర్తిలు గొడవ పడ్డారు. శుక్రవారం ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు



వీరవాసరం, ఫిబ్రవరి 8: చింతలకోటిగరువు పరిధిలోని నడపనవారిపాలెం గ్రామానికి చెందిన పిండి వెంకటకృష్ణ కనిపించడం లేదని అందినఫిర్యాదుపై కేసు నమోదు చేశామని వీరవాసరం ఎస్ఐ రమేష్ తెలిపారు. ఫిబ్రవరి ఒకటవ తేదీ నుంచి కనిపించడం లేదని అతని మేనమామ శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఏకారణం లేకుండానే ఇంటి నుంచి వెళ్లాడని తిరిగి రాలేదని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సీపీ సీడ్స్ డీఎం అనుమానాస్పద మృతి



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 8: నూజివీడు మండలం మీర్జాపురం గ్రామ పరిధిలోని సీపీ సీడ్స్ కంపెనీలో డీఎంగా పనిచేస్తున్న థాయ్‌లాండ్ వర్సిట్ జంకియో(45) అను మానాస్పద స్థితిలో మృతిచెందాడు. గురువారం సీడ్స్ కంపెనీలో మీటింగ్ సమయంలో బయటకు వచ్చిన ఆయన కార్యాలయపు పైభాగంలోని సెకండ్ ఫ్లోర్ పైభాగంలో గల వాష్ రూమ్‌లో ఉన్న ఓపెన్ ఏరియాకు వెళ్లి అక్కడి నుంచి కిందికి పడిపోవడంతో తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. క్షతగాత్రుడిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడిది థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌గా కంపెనీ వర్గాలు తెలిపాయి. నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్‌గౌడ్ నూజివీడు రూరల్ ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిం చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ తెలిపారు.

లాకర్‌లో బంగారం మాయంపై విచారణ

తణుకు, ఫిబ్రవరి 8: దువ్వ ప్రాథమిక సహకారం పరపతి సంఘంలో లాకర్‌లో ఉన్న బంగారు ఆభరణాలు మాయం అవడంపై అధికారులు, పోలీసులు విచారణ చేపట్టారు. గురువారం దువ్వ సొసైటీలోని లాకర్‌లో భద్ర పర్చుకున్న యన్నమని ఉమామహేశ్వరికి చెందిన 806 గ్రాముల బంగారు ఆభరణాలు మాయం అవ్వడం తెలిసిందే. 2018 సంవత్సరంలో లాకర్‌లో బంగారు నగలు భద్రపర్చుకొన్నారు. ఆరు సంవత్సరాలు తర్వాత ఈనెల 6న లాకర్ తెరచి చూడగా లాకర్‌లో వస్తువులు కనిపించకపోవడంతో ఉమాదేవి సొసైటీ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్ రాజ్‌కుమార్, ఎస్ఐ చంద్ర శేఖర్‌లు సొసైటీలో విచారణ చేపట్టారు. భీమవరం జిల్లా కోఆపరేటివ్ అధికారి ఆదేశాలు మేరకు తణుకు డీసీవో వెంకటేశ్వరరావు సొసైటీలో రికార్డులను పరిశీలించారు. బాధితురాలు సమక్షంలో అధికారులు పలు రికార్డులును తనిఖీ చేశారు. ఉమాదేవి గతంలో రికార్డుల్లో ఉన్న సంతకాలు, లావాదేవీలు సరిచూసి సంతకాలను సరిపోల్చుకున్నారు.

21 మంది వీఆర్వోలకు పదోన్నతులు



కారుణ్య నియామకపత్రం అందిస్తున్న కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 8: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న 21 మంది వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు అందజేశారు. ఏలూరు జిల్లా ఆకివీడు మండలానికి చెందిన కడిమి కిరణ్‌కు ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కారుణ్య నియా మకం ద్వారా అటెండర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వీఆర్‌వోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు, రవీంద్ర రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మినారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీరామ చంద్రమూర్తి, రాంబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

నిరుద్యోగులను మోసం చేసిన ముఖ్యమంత్రి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో 55 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 6100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇచ్చి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి నిరుద్యోగులను మోసం చేశారని పీవైఎల్, పీడీఎస్‌యూ నాయకులు టి.బాబు రావు, బి.వినోద్ విమర్శించారు. బుట్టాయగూడెంలో గురువారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు 50 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తానని హామీ ఇచ్చిన జగన్మోహనరెడ్డి ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో 6100 పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గమన్నారు. ప్రతి సెప్టెంబరు 5న డీఎస్సీ నోటిఫి కేషన్ ఇస్తానన్న ముఖ్యమంత్రి హామీ అమలుకు నోచుకోలేదన్నారు. 55 వేల టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పూనెం రాముడు, కె.శంకరు, ఎం.నిఖిల్, ఈ.చరణ్ తేజ, కె.మంగ రాజు, జి.నాగిరెడ్డి, ఎం.రామ్‌చరణ్, టి.రామ్‌చరణ్ పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ధర్నా

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 8: రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని ఏపీ రైతు, కౌలురైతు సంఘాల జిల్లా అధ్యక్షుడు పి.సోమశేఖర్, దొంత కృష్ణ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. సోమశేఖర్ మాట్లాడుతూ పెట్టుబడి వ్యయం పెరిగి మద్దతు ధర లేక రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తానని, ఆత్మహత్యలు నివారిస్తానని వాగ్దానం చేసిన మోదీ అధికారం చేపట్టిన తరువాత రైతు సంక్షేమాన్ని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందజేశారు. జి.రామచంద్రారెడ్డి, ఆర్.రాజారావు, సత్యనారాయణ, కురేళ్ళ వరప్రసాద్, జి.స్వాతి, ఉప్పులూరి లక్ష్మిభవానీ తదితరులు పాల్గొన్నారు.

రైతుల రుణాలు మాఫీ చేయాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 8: నష్టాల ఊబిలో కూరుకుపోయిన రైతుల రుణాలు మాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాలని, కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు. స్మార్ట్ మీటర్లు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కె.అద్దయ్యకు రైతు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. చిలపరెడ్డి వెంకట రెడ్డి, జమ్మి శ్రీనివాసరావు, గొలిమే బాలఏసు, ఎస్‌కే.బాజీ, చల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వంటా వార్పుతో న్యాయవాదుల నిరసన

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 8: భూహక్కుల చట్టాన్ని వ్యతిరేకిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వంటా వార్పుతో నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు తల్లాడి అశోక్ కుమార్, క్రీడా కార్యదర్శి పాశం సాయి ప్రతాప్, సహాయ కార్యదర్శి తామ రఘురామ్, న్యాయ వాదులు, పి.ఎస్.ఆర్. లక్షమణారావు, ఉద్దండం ఏసుబాబు, మాదేపల్లి క్రాంతికుమార్, గన్నమని శేఖర్, జువ్వల బాబూజీ, పిల్లి పెద్దిరాజు, బండారు లతకుమారి, బల్లే సాయికుమారి పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 8: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జె.శ్రీనివాసరావు, డీఎస్‌వీడీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయం వద్ద కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఎన్నికలకు ముందు జగన్ పాదయాత్రలో కాంట్రాక్టు కార్మికులందర్నీ క్రమబద్ధీకరిస్తానని హామీ ఇచ్చారన్నారు. కానీ ఇంత వరకు రెగ్యులర్ చేయ్యలేదన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లను సంస్థలో విలీనం చేయాలన్నారు. అనంతరం ఎస్ఈకి వినతిపత్రం సమర్పించారు. రాముడు, సుబ్రహ్మణ్యం, జానకిరాముడు, వెంకటేశ్వరరావు, పవన్‌కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

భద్రతా నియమాలతో ప్రమాదాల నివారణ

పెదవేగి, ఫిబ్రవరి 8: భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమని ఏఎంవీఐ వై.సురేష్‌బాబు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశనుంచే రహదారి భద్రతా నియమాలపై అవగాహన అవసరమన్నారు. రహదారి మలుపులు, కూడళ్లలో ఎలా వెళ్ళాలి, ట్రాఫిక్ సిగ్నల్స్ నియమాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. రహదారి భద్రతా వైద్యురాలు జి.మౌనిక, ప్రిన్సిపాల్ పి.బాలకృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

11న జనసేన కార్యకర్తల సమన్వయ సమావేశం

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 8 : స్థానిక జనసేన కార్యాలయంలో ఈనెల 11న జనసేన శ్రేణుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పార్టీ విధి విధానాలపై దిశ, దశ నిర్దేశాలపై కూడా చర్చలు జరుపుతామని, కార్యకర్తలు, వీర మహిళల నుంచి అభిప్రాయాలు సేకరిస్తామని చెప్పారు. జనసేన శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, వీర మహిళలందరూ రావాలన్నారు తెలిపారు. అనంతరం నగరంలో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. నగిరెడ్డి కాశీ నరేష్, బొత్స మధు, కందుకూరి ఈశ్వర రావు, సరిది రాజేష్, కందుకూరి ఈశ్వరరావు, నిమ్మల శ్రీను పాల్గొన్నారు.









చింతలపూడి, ద్వారకా తిరుమల పోలీస్ స్టేషన్‌ల వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నేతలు, ఆశా వర్కర్లు, ఏలూరులో ఆశా వర్కర్లకు భోజన సౌకర్యం, ఉంగుటూరులో పోలీసుల అదుపులో ఆశ వర్కర్లు

ఆశా వర్కర్ల

అక్రమ నిర్బంధం

ప్రభుత్వ తీరుపై నిరసన.. పోలీస్ స్టేషన్ వద్ద నినాదాలు

భీమడోలు, ఫిబ్రవరి 8: ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ విజయవాడ ధర్నాకోసం వెళుతుంటే అక్రమంగా నిర్బంధించారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుపై ఆశ కార్యకర్తలు, సీపీ ఎం నేతలు, సీఐటీయూ ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. వర్కర్లను నిర్బంధించిన పోలీస్ స్టేషన్‌ల వద్ద నినాదాలు చేశారు. పోలీసులు అక్రమ అరెస్టులు చేయడాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు తీవ్రంగా ఖండించారు. బుధవారం రాత్రి నుంచి ఆశ వర్కర్ల ఇళ్ల చుట్టూ తిరిగి జిల్లా వ్యాప్తంగా వందల మందిని అరెస్టు చేశారని భీమడోలు, ఉంగుటూరు, ద్వారకా తిరుమల మండలాల్లోని ఆశ వర్కర్లను గుండుగొలను, పూళ్ళ రైల్వే స్టేషన్లలో అరెస్టుచేసి గురువారం భీమడోలు పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. భీమడోలు పోలీస్ స్టేషన్ ముందు ఆశ వర్కర్ల నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సుమారు 50 మంది ఆశ కార్యకర్తలను భీమడోలు పోలీస్ స్టేషన్‌లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ ఉంచడం ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ట అన్నారు. రైతు సంఘం జిల్లా నాయకుడు కట్టా భాస్కరరావు, వీర్రాజు, ఆశ యూనియన్ నాయకులు ఉదయమణి, తిరుపతమ్మ, లక్ష్మి, భోజనాల సుధారాణి, దయామణి పాల్గొన్నారు.

- నిడమర్రు: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అపలేరని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నారపల్లి రమణారావు హెచ్చరించారు. నిడమర్రు పోలీసుస్టేషన్‌లో విజయవాడ వెళుతున్న ఆశా కార్యకర్తలను దారికాచి అరెస్టు చేసి పోలిస్‌స్టేషన్‌లో బందించడాన్ని ప్రజాసంఘాలు తీవ్ర ఖండించాయి. సీఐటీయూ నాయకులు ఆశా కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. అంతకుముందు సీఐటీయూ నాయకులు నారపల్లి రమణారావు తదితరులను ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకోని నోటీసులు అందజేశారు.
- ద్వారకా తిరుమల: ఆశా వర్కర్లను అరెస్టు చేయడాన్ని సీఐటీయూ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. ద్వారకాతిరుమల, సీహెచ్ పోతేపల్లి ఆశా వర్కర్లను పంగిడిగూడెం వద్ద నిర్బంధించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పూచీకత్తుపై విడిచిపెట్టారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని వీడకుంటే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాల్సి ఉంటుందని ఆదికృష్ణ, నాగలక్ష్మి, లలిత, ధనలక్ష్మి తదితరులు హెచ్చరించారు.
- చింతలపూడి: టి.నరసాపురం, చింతలపూడి మండలాల నుంచి విజయవాడ వెళుతున్న ఆశా వర్కర్లను అరెస్ట్ చేసి చింతలపూడి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని నిరసిస్తూ సీపీఎం, సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. ఆర్‌వి.సత్యనారాయణ, నత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళలను రాత్రివేళ కూడా పోలీస్‌స్టేషన్‌లో ఉంచడం సరికాదన్నారు. ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాళ్ళు బి.సరళ, వనిత ఈ ధర్నాలో పాల్గొన్నారు.
- కొయ్యలగూడెం: ఆశా వర్కర్ల చలో విజయవాడ కార్యక్రమాన్ని ప్రభుత్వం భగ్నం చేసింది. పలువురు ఆశావర్కర్లను అరెస్టు చేసి కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేయడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాంబాబు అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అణచివేత నిర్ణయాలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో 20మంది ఆశావర్కర్లను అరెస్టు చేశారు.
- కుక్కునూరు: ఆశా వర్కర్లను అరెస్ట్ చేయడం దారుణమి సీఐటీయూ మండల కార్యదర్శి సాయికిరణ్, సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు అన్నారు. ఆశా వర్కర్లను అరెస్ట్ చేశారని, వారికి మద్దతు తెలిపిన సీఐటీయూ, సీపీఎం నాయకులను బుధవారం నుంచి గృహ నిర్బంధం చేశారన్నారు. మొండి వైఖరి విడనాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. మేడిపల్లి బాబు, కోట మోహన్‌రావు, షేక్ వలిపాషా, తదితరులు ఉన్నారు.
- ఏలూరు టూటౌన్: ఆశా వర్కర్ల నిర్బంధం అప్రజాస్వామికమని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. సీపీఎం కార్యాలయంలో రవి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిర్బంధం అప్రజాస్వామిక వైఖరి విడనాడకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. విజయవాడలో ఆశా వర్కర్ల మహాధర్నాను విచ్ఛిన్నం చేశారు. బుధవారం నుంచి జిల్లా పోలీసులు ఆశాలపై నిర్బంధం, అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. మహిళలు అని కూడా చూడకుండా అర్ధరాత్రి ఇళ్లకు వెళ్ళి దౌర్జన్యంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆశాలకు మద్దతు ఇచ్చిన సీఐటీయూ, సీపీఎం నేతలు కిషోర్, ఎస్.మహంకాళి, ఆర్.లింగరాజు, సోమయ్య, శ్యామలరాణి, జగన్నాధరావు, గోపి, దుర్గారావును అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడం నిరంకుశ చర్య అన్నారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో అరెస్టు చేసిన ఆశా, సీఐటీయూ నేతలను ఫోటోలు తీసేందుకు వెళ్లిన పత్రికా విలేకర్లను సైతం అడ్డుకుని బయటకు పంపివేయడాన్ని ఖండించారు. వైసీపీ ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి అణచివేత చర్యలకు పాల్పడడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. నూజివీడులో సీఐ ఆశా వర్కర్లను దూషించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు ఆశాలపై ఈవిధంగా వ్యవహరించడం సరి కాదన్నారు. విజయవాడ వెళ్లిన ఆశా వర్కర్లను బస్సుల్లో ఎక్కించుకుని నూజివీడు సారధి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్బంధించారన్నారు. వారికి కనీసం భోజన సదుపాయాలు ఏర్పాటు చేయ్యలేదన్నారు. బయట పోలీసులు భోజనాలు కావాలని చెబితే మీకు భోజనాలు కావాలంటూ ఎగతాళిగా మాట్లాడారన్నారు.
- పెదవేగి: ఆశాలపై పోలీస్ జులం హేయమని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనకుండా ఆశా కార్యకర్తలను పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధించడంపై చింతమనేని ధ్వజమెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన ఆశా కార్యకర్తలకు మధ్యాహ్నం రెండున్నర గంటలు దాటినా భోజనం పెట్టకపోవడంతో అప్పటికప్పుడు ఎన్టీఆర్ - చింతమనేని జనతా క్యాంటిన్‌లో భోజనం సిద్ధం చేయించారు. ఏలూరు సీఐటీయూ కార్యాలయానికి తీసుకెళ్లి పోలీసుల నిర్బంధంలో ఉన్న ఆశా కార్యకర్తలకు దగ్గరుండి మరీ భోజనం వడ్డించారు. ఆశాల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ప్రభాకర్ డిమాండ్ చేశారు.
- ఉంగుటూరు: నిడమర్రు సీఐ మోగంటి వెంకట సుభాష్ ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజాము నుంచి చేబ్రోలు పోలీసు స్టేషన్ పరిధిలో ఆశా వర్కర్ల కదలికలపై నిఘా ఉంచారు. చేబ్రోలు, నిడమర్రు ఎస్ఐలు తమ సిబ్బందితో ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. విజయవాడ వెళుతున్న 19 మంది ఆశా వర్కర్లను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చేబ్రోలు ఎస్ఐ ఎ.కిరణ్ కుమార్ తెలిపారు.

నీలాద్రిపురంలో జనంలోకి జనసేన



సమస్యలు తెలుసుకుంటున్న ధర్మరాజు

ఉంగుటూరు, ఫిబ్రవరి8: బలహీన వర్గాల అభ్యున్నతికి జనసేన, టీడీపీ కూటమి కృషి చేస్తుదని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు, నిడమర్రు మండలాల అధ్యక్షులు పంది రాంబాబు, నిమ్మల దొరబాబు, గ్రామ అధ్యక్షుడు బొట్టా మహేష్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం అక్కౌంట్ టెస్టు ఫీజు చెల్లింపునకు గడువు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8: హెడ్మాస్టర్ అక్కౌంట్ టెస్టు-2024 పేపర్-1, 2 పరీక్షలకు ఫీజును సీఎఫ్‌ఎంఎస్‌ద్వారా ఈ నెల 17లోగా, పెనాల్టీ రూ.60తో చెల్లించేందుకు గడువు ఉందని డీఈవో ఎస్.అబ్రహం గురువారం తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేయడానికి bse.ap.gov.in వెబ్‌సైట్ అందుబాటులో ఉందన్నారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేసిన ప్రింటెడ్ అప్లికేషన్, ఇతర డాక్యుమెంట్లను ఈ నెల 18లోగా ఏలూరు డీఈవో కార్యాలయంలో అందజేయాలని కోరారు. పరీక్ష ఫీజును పేమెంట్ గేట్‌వే ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

10 పరీక్షల వాల్యూయేషన్‌కు మినహాయింపు ఇవ్వండి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 8: పదో తరగతి పరీక్షల వాల్యూయేషన్‌కు ఉపాధ్యాయుల వివరాలు పంపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తూ ఏపీటీఎఫ్ మండల శాఖ తరపున కన్వీనర్ శ్రీనివాస్ ఎంఈవోకు వినతి పత్రం అందించారు. మండలంలో పనిచేసే 55 ఏళ్లు నిండిన పురుషులు, 50 ఏళ్లు నిండిన మహిళా ఉపాధ్యా యులకు విధులు వేయకుండా చూడాలని కోరారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని, గర్భిణులు, చిన్న పిల్లలతో ఉన్న మహిళా టీచర్లకు డ్యూటీలు వేయకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఆటల పేరుతో చదువులకు ఆటంకాలు కల్పించవద్దు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 8: పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో ఆటల పేరుతో విద్యార్థుల చదువులకు ఆటంకాలు కల్పించవద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజిలో టీటీఆర్ ఫౌండేషన్ ఆటల పోటీలు కారణంగా ఇంటర్, 10వ తరగతి విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు ఇటువంటి విషయాలను పరిగణలోకి తీసుకోకుండా పోటీలు నిర్వహించడం సరైందికాదని, పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల సమస్యలపై దృష్టిపెట్టాలని హితవు పలికారు.

మహిళలకు అధికార పార్టీ బెదిరింపులు

పోలవరం, ఫిబ్రవరి 7 : స్వయం సహాయక సంఘాల మహిళలు ఆసరా సంబరాలకు హాజరు కాకపోతే రూ. వంద కట్టాలని అధికార పార్టీ నేతలు బెదిరిస్తున్నారని టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మంగిన కొండ విమర్శించారు. టీడీపీ కార్యాలయం వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో 942 సంఘాల మహిళలను సీఏల ద్వారా బెదిరిస్తున్నారన్నారు. గెడ్డపల్లి, మెత్తప్పకోట, ఉడతపల్లి, ఎల్ఎన్‌డీపేట గ్రామాలు పోలవరం వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయానికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, పులి సంచారంతో భయపడుతున్న వారిని అటవీ ప్రాంతాల నుంచి ఆసరా వారోత్సవాలకు రప్పించారన్నారు. అర్హులైనా కొందరికి ఆసరా సొమ్ములు రాలేదన్నారు. అరకొరగా సొమ్ములు విదిల్చి మహిళల్ని మోసం చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు యడ్ల వినోద్, ఆకుల రాజా, మంగిన పోశీరత్నం, మేడం పార్వతి, పట్నాల దేవి ఇతర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో విద్యుత్ సర్వీసుల రిజిస్ట్రేషన్



మాట్లాడుతున్న డీఈఈ ఝాన్సీలక్ష్మి

పెదవేగి, ఫిబ్రవరి 8: కొత్తగా విద్యుత్ సర్వీసులు పొందాలనుకునేవారు సచివాలయాల్లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు డీఈఈ ఝాన్సీలక్ష్మి తెలిపారు. పెదవేగి విద్యుత్ ఉపకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయం, గృహావసరాలకు కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు సచివాలయాల్లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అంచనాలో సూచించిన మొత్తానికి మించి సొమ్ము చెల్లించవద్దని, ఎవరైనా అధికంగా సొమ్ము డిమాండ్ చేస్తే తక్షణం ఫిర్యాదు చేయాలని ఆమె తెలిపారు. అనంతరం గార్లమడుగు సచివాలయాన్ని సందర్శించిన డీఈఈ ఝాన్సీలక్ష్మి అక్కడ కొత్త సర్వీసులు కోసం వచ్చిన ఇద్దరు రైతులకు సచివాలయంలో అవగాహన కల్పించి, రిజిస్ట్రేషన్ చేయించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఏడీ పి.శ్రీనివాస్, ఏఈ నాగోషుడు, రైతులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యలపై అవగాహన సదస్సు

పెదపాడు, ఫిబ్రవరి 8: వ్యవసాయ, గృహావసరాలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లుగా ఏడీ త్రివాస్ తెలిపారు. కొక్కిరపాడులో విద్యుత్ సమస్యలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ప్రతి సబ్‌స్టేషన్ పరిధిలో లోఓల్టేజీ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటుగా వ్యవసాయ అవసరాల కోసం నాణ్యమైన విద్యుత్ అంతరాయం లేకుండా అందజేస్తున్నామన్నారు. రైతులు, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏఈ వై.రాంబాబు, వ్యవసాయశాఖ ఏవో ప్రదీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

- భీమడోలు: భీమడోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ద్వారకా తిరుమల, భీమడోలు మండలాల రైతులు, విద్యుత్ వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ శాఖ ఈఈ నటరాజన్ విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తులపై సూచనలు ఇచ్చారు.

పది ఎకరాల గడ్డివాము దగ్ధం

లింగపాలెం, ఫిబ్రవరి 8: కలరాయనగూడెంలో పది ఎకరాల గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన కాట్రు సుకుమార్ పొలం వద్ద గడ్డివామికి గురువారం నిప్పు అంటుకోవడంతో దగ్ధమైంది. గ్రామస్తులు వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. ఫైర్‌సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. గడ్డి విలువ సుమారు రూ.లక్షా80వేలు ఉంటుందని ఫైర్ ఆఫీసర్ ఘంటా వెంకటేశ్వరరావు తెలిపారు. ఫైర్ ఇన్‌చార్జ్ ఆదిశేషు, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 8: ఐటీడీఏ పరిధిలోని లంకాలపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నూప వెంకటరమణ(57) గురువారం మృతి చెందారు. ప్రస్తుతం చింతలపూడి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. వెంకటరమణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో మృతి చెందారు. ఆయన భార్య ముచ్చిక కమల టీచర్‌గా పనిచేస్తుండగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

- జీలుగుమిల్లి : రమణ మాస్టారు మృతికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివాసీ టీచర్ అసోసియేషన్ అధ్యక్షుడు సోదెం రాజు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొర్స రామకృష్ణ, పి.పోసి, ఎం.గంగరాజు, కె.రామారావు, బెనహర్ సంతాపం తెలిపారు.

ఆటో డ్రైవర్లు రహదారి నిబంధనలు పాటించాలి



చెక్కును అందజేస్తున్న తపన చౌదరి

భీమడోలు, ఫిబ్రవరి 8: ఆటో డ్రైవర్లు రహదారి భద్రతా నియమాలు పాటించాలని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి సూచించారు. భీమడోలు వేంకటేశ్వరా ఆటో యూనియన్ కార్యాలయ భవన నిర్మాణానికి తపన ఫౌండేషన్ తరపున రూ.50 వేల విరాళాన్ని తపన చౌదరి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు బాదరవాడ కృష్ణమోహన్‌రాజు, ఉంగుటూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ వెజ్జు ధర్మారావు, బీజేపీ నాయకులు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ తరపున జబర్దస్త్ కళాకారుల ప్రచారం



జబర్దస్త్ కళాకారుల ప్రదర్శన

చింతలపూడి, ఫిబ్రవరి 8: బీజేపీ తరపున జబర్దస్త్ కళాకారులు ప్రదర్శనలు, ప్రచారం నిర్వహించారు. మండలంలోని ఎర్రగుంటపల్లిలో జబర్దస్త్ టీమ్, సినీ గాయకులు సందడి చేశారు. రాఘవాపురం, ప్రగడవరం, చింతలపూడి పట్టణంలో ప్రదర్శనలు ఇచ్చారు. సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ తపనా ఫౌండేషన్ ద్వారా గారపాటి చౌదరి చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అప్పారావు, బాబీ, వినోద్, ఇమ్మానియేల్ ఫ్యామిలీతో అలరించగా, లాస్య ప్రియ, అరుణ్‌కౌండిన్యలు పాడిన పాటలు అలరించాయి. వీరితోపాటు స్థానిక నాయకులు చోటా వెంకటనారాయణ, యేసుబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథస్వామి ఊరేగింపు



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

టి.నరసాపురం, ఫిబ్రవరి 8: స్థానిక అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో జగన్నాథుడి రథోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. పూజారి వినయ్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్ రాజు, పసుమర్తి రాము, పర్వతనేని మురళి, కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

12న జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశం

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 8: జిల్లా డెవలప్‌మెంట్ కోఆర్డినేషన్, మానటరింగ్ కమిటీ సమావేశం ఎంపీ కోటగిరి శ్రీధర్ అధ్యక్షతన ఈనెల 12న జరుగుతుందని కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్ గురువారం తెలిపారు. 2024 ఏడాదికి కార్యాచరణ ప్రణాళిక, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, చర్యలు, కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్షించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కలెక్టరేట్ :** రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ శుక్రవారం కైకలూరు మండలం రాచపట్నం రానున్నారు. ఎస్సీ కుటుంబానికి చెందిన భూమి ఆక్రమణ పై విచారణ జరుపుతారు.
- ఏలూరు సెక్షన్ పరిధిలోని శనివారపుపేట 33-11కె.వి సబ్‌స్టేషన్ మరమ్మత్తుల కారణంగా దుగ్గిరాల బైపాస్ శ్రీరామ్‌నగర్, విద్యానగర్ ఫీడర్లకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఈఈ జే.పి.బి నటరాజన్ తెలిపారు.
- **ఏలూరు టూటౌన్ :** నగర పాలక సంస్థ పంపిణీ చేస్తున్న నీటి సరఫరా వేళలు ఈ నెల 10న శనివారం మార్పులు చేస్తున్నట్లు కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ తెలిపారు. ప్రత్యేక కారణాల వలన శనివారం 8.30 నుంచి 9.30నిమిషాల వరకు నీటి సరఫరా చేస్తామన్నారు.
- **పెదవేగి :** గ్రామాల అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీపీ తాతా రమ్య అన్నారు. ఎంపీపీ రమ్య అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సమావేశంలో తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, ఇతర అంశాలపై చర్చించారు. వైస్ ఎంపీపీ మేడికొండ ఉమాదేవి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఏవో కేవీ.జాన్సన్, ఏపీవో హేమలత, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.
- **బుట్టాయగూడెం :** మండల పాస్టర్ల నూతన కార్యవర్గం ఎన్నిక మర్లగూడెంలో జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా పలివెల దావీదు, కె.దానియేలు, కోశాధికారిగా పోలోజు దావీదు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- పెద్దపులి దాడిలో పాడి ఆవును కోల్పోయిన కొవ్వాడ గ్రామానికి చెందిన కుంజం కొవ్వాడయ్యకు గురువారం డీఎఫ్‌వో రవీంద్ర ధామ రూ.30 వేల చెక్కును నష్టపరిహారంగా అందజేశారు.
- **కొయ్యలగూడెం :** గవరవరంలో తాగునీటి సమస్యను రైతులు ఎంపీడీవో అశోక్‌కుమార్‌కు దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే పరిష్కరించాలని కార్యదర్శికి ఎంపీడీవో సూచించారు.
- **భీమడోలు :** మండలంలోని గుండుగొలను, ఆగడాలలంక గ్రామాల్లో పదో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు, ఆర్థిక సాయం అందజేశారు.
- **కామవరపుకోట :** రావికంపాడు గ్రామానికి చెందిన ఏలేటి జాన్ మోకాలి శస్త్రచికిత్సతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. స్కౌట్స్ గైడ్స్ శిక్షణా అధికారి బిరుదుగడ్డ నాగేశ్వరరావు విద్యార్థులను చైతన్యపరిచి నెల రోజులకు సరిపడా వంట సామగ్రి, బియ్యం అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు



అప్పనవీడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న చింతమనేని



శ్మశాన స్థలం పరిశీలిస్తున్న బడేటి చంటి

బుగ్గన బడ్జెట్

అంకెల గారడీ

టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని ధ్వజం

భీమడోలు, ఫిబ్రవరి 8: ఆర్థిక మంత్రి బుగ్గన ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీయేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు ఎద్దేవా చేశారు. భీమడోలులోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం సమావేశంలో మాట్లాడుతూ బుగ్గన బడ్జెట్ అంచనాలు కొండంత ఖర్చులు పిసరంత అన్నారు. 13వేల కోట్ల రూపాయల రెవెన్యూ లోటును 44 వేల కోట్లకు, 35 కోట్ల ద్రవ్య లోటును 60 వేల కోట్లకు పెంచిన ఘనత ఆర్థిక మంత్రిదేనన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమి లేవని ప్రస్తుతం ఏపీఎఫ్ 11.58 లక్ష కోట్లు అని, మద్యం బాండ్లు 16 వేల కోట్లు, కార్పొరేషన్ హామీలు 1,10,603 కోట్లు, కార్పొరేషన్ తనఖాలు 94,920 కోట్లు అన్నారు. డిస్కం బకాయిలు 27,284 కోట్లు, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు 95,400 కోట్లు అని గన్ని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో ఏపీఎఫ్‌లు రెట్టింపు అయ్యాయని గత టీడీపీ కంటే నాలుగు రెట్ల అప్పు అదనంగా తీసుకున్నారని, రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని గన్ని విమర్శించారు. ధరల పెంపుతోపాటు రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు జగన్ సర్కారుకే వర్తిస్తుందని విద్యుత్ చార్జీలు పెంచడంలో వైసీపీ సర్కారు ఎక్కడా రాజీ పడలేదని ఇప్పటికి ఏడు సార్లు సర్‌ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచారన్నారు. విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌లలో 1000 కోట్ల అవినీతి జరిగిందని, బీసీ సంక్షేమం సబ్ ప్లాన్ నిధులు 75 వేల కోట్లు దారి మళ్లాయని ఆయన అన్నారు. కరణం పెద్దిరాజు, దోసనపూడి పుల్లయ్యనాయుడు, యడ్లపల్లి రామకృష్ణ, శేషుగిరి పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి తెలుగుదేశంతోనే సాధ్యం

పెదపాడు: రాష్ట్రాభివృద్ధి తెలుగుదేశం పార్టీ చంద్రబాబు నాయకత్వంలోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. అప్పనవీడులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతమనేని పార్టీ శ్రేణులు, జనసేన నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి టీడీపీ ఆరు పథకాలను వివరించారు. చింతమనేని మాట్లాడుతూ జగన్ ఎన్నికల ముందు మోసపూరిత హామీలతో నెగ్గి గెలిచిన తరువాత ప్రజల నెత్తిన లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోపారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా వైకాపాకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మోరు శ్రావణి, వేమూరి శ్రీనివాసరావు, ఉప్పలపాటి రాంప్రసాద్, గుత్తా అనిల్, గారపాటి రామసీత, మట్టా శ్రీనివాసరావు, వడ్డి వాసవి, లావేటి శ్రీనివాసరావు, బెక్కం లక్ష్మీనారాయణ, కొత్తూరు చినబాబు, అక్కినేని వంశీకృష్ణ, బోయపాటి దీపు, యలమంచిలి ప్రవీణ్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే శిలాఫలకాలేనా..?

ఏలూరు టూటౌన్: అభివృద్ధంటే శిలాఫలకాలు వెయ్యడమేనా అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి చంటి ప్రశ్నించారు. వెంకన్న చెరువు స్మశాన వాటికను టీడీపీ నాయకులుతో కలిసి గురువారం పరిశీలించారు. చంటి మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అదరాబదరాగా శిలాఫలకాలు వేసి ప్రజలను మభ్యపెట్టడమేనా అని ప్రశ్నించారు. గత నాలుగేళ్ళ నుంచి అభివృద్ధి గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. గతంలో మాజీ ఎమ్మెల్యే బడేటి బుజ్జి శ్మశానవాటికను అభివృద్ధి చేశారన్నారు. ఇప్పుడు దానికే రంగులు వేసి శిలాఫలకాన్ని నిలబెట్టారని, నగరంలోని శ్మశానాల్లో కనీస సౌకర్యాలు లేవన్నారు. పాలకులు పట్టించుకున్న పాపంలేదన్నారు. అశోక్ నగర్‌లోని స్మశాన వాటికలో బ్లాష్ స్వచ్ఛంద సంస్థ ఎన్నో సౌకర్యాలు కల్పించిందని వాటిని ఓర్వలేని వైసీపీ ఎమ్మెల్యే విధ్వంసానికి పాల్పడ్డారని అన్నారు. కార్యక్రమంలో చోడే వెంకటరత్నం, పూజారి నిరంజన్, దాసరి ఆంజనేయులు, మారం హనుమంతరావు పాల్గొన్నారు.

'సారథి' కాలేజీలో ఆర్డీవో, డీఎస్పీ పరిశీలన


సారథి కళాశాలను పరిశీలిస్తున్న ఆర్డీవో, డీఎస్పీ

నూజివీడు, ఫిబ్రవరి 8: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సామగ్రిని భద్రపరచడం, పంపిణీకి సంబంధించి నూజివీడు సారథి ఇంజినీరింగ్ కళాశాలను నూజివీడు ఆర్డీవో వై.భవానీశంకర్, డీఎస్పీ ఈ.అశోక్‌కుమార్‌గౌడ్ గురువారం పరిశీలించారు. త్వరలో జరిగే ఎన్నికల సందర్భంగా ఈవీఎం, వీవీ ప్యాట్‌ల స్టోరేజ్, డిస్ట్రిబ్యూషన్‌కు సంబంధించిన భద్రత, ఇతర అంశాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో నూజివీడు తహసీల్దార్ విశ్వనాథశాస్త్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అధికారుల పరిశీలన


ముసునూరులో పరిశీలిస్తున్న అధికారులు

ముసునూరు, ఫిబ్రవరి 8: ముసునూరులో ఉన్న ఏడు పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎమిలికుమారి, ఎస్‌ఐ వాసులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీ పాఠశాలలో ఉన్న 77,78,79,80 నంబరు గల పోలింగ్ కేంద్రాలు, ఎంపీపీ మెయిన్ పాఠశాలలో ఉన్న 81,82,83 నంబరు గల పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్న సౌకర్యాలు, చుట్టుపక్కల పరిస్థితులను అధికారులు పరిశీలించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై బీఎల్‌వోతో చర్చించారు. త్వరలో జరిగే ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఈవోపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, బీఎల్‌వోలు సంధ్యారాణి, మస్తాన్‌రావు, యశోద, వినోద్, మనోజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

విశ్వగురు కామధేను అవార్డుకు వైష్ణవి ఎంపిక


ఎ.వైష్ణవి

ముదినేపల్లి, ఫిబ్రవరి 8:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి హైదరాబాద్‌లో ఏర్పాటైన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఆర్గనైజేషన్ ఇచ్చే కామధేను అవార్డుకు ముదినేపల్లికి చెందిన అమరావతి మాజీ బ్రాండ్ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి ఎంపికయ్యారు. 2024వ సంవత్సరానికి ఈ అవార్డుకు ఆమెను ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, సీఈవో డాక్టర్ సత్యవోలు రాంబాబు గురువారం ప్రకటించి ఆహ్వానం పంపించారు. ఈ అవార్డును ఈనెల 11న వైష్ణవికి అందజేయనున్నారు. వైష్ణవి తన ఎనిమిదేళ్ల వయస్సు నుంచే ప్రైవేట్ వైద్యుడిగా ఉన్న తండ్రి డాక్టర్ మనోజ్ సహకారంతో తోటి విద్యార్థులకు సహాయం చేయడం, పాఠశాలల వద్ద తాగునీటి సౌకర్యం, మొక్కల పెంపకం, అగ్ని ప్రమాద బాధితులకు ఉమ్మడి కృష్ణాలోని పలు ప్రాంతాల్లో ఆర్థిక సాయం అందించటం, కరోనా సమయంలో ప్రైవేట్ ఉద్యోగులకు ఆర్థిక సహాయం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించటాన్ని గుర్తించిన విశ్వగురు సంస్థ కామధేను అవార్డుకు ఆమెను ఎంపిక చేసింది.

త్రిసభ్య కమిటీల కాలం మరో ఆరునెలలు పొడిగింపు

ముదినేపల్లి, ఫిబ్రవరి 8:ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు తిరిగి త్రిసభ్య కమిటీలే నామినేట్ అయ్యాయి. ముదినేపల్లి మండలంలోని 15 పీఏసీఎస్‌లకు పాత త్రిసభ్య కమిటీలనే మరో ఆరు నెలల కాలపరిమితితో నియమిస్తూ ఏలూరు కో-ఆపరేటివ్ డీఆర్ ఉత్తర్వులు జారీ చేశారు. గత ఆరు నెలలుగా త్రిసభ్య కమిటీలకు అధ్యక్షులుగా వ్యవహరించిన వారినే తిరిగి మరో ఆరు నెలలపాటు కొనసాగిస్తున్నారు.

నేటినుంచి 'పల్లెకు పోదాం' విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు వాసు

ముసునూరు, ఫిబ్రవరి 8: గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించడం తోపాటు, పథకాలందని అర్హులందరికీ లబ్ధి చేకూర్చేందుకు శుక్రవారం నుంచి 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కో-కన్వీనర్ మాగంటి వాసు పిలుపునిచ్చారు. గురువారం చిల్లబోయినపల్లిలో పార్టీ మండల అధ్యక్షుడు అనగాని రాంబాబు అధ్యక్షతన బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం నుంచి 11వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమ నిర్వహణకు ప్రతి మండలానికి 30మంది కో-ఆర్డినేటర్లను నియమించామన్నారు. గ్రామాల్లో మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఉద్యోగులు, భజన మండలిలతో సమావేశాలను నిర్వహించాలని కో-ఆర్డినేటర్లకు సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కోడూరు లక్ష్మీనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఆముదాల ఇసాక్, మహిళా మోర్చా నాయకురాలు పొలగాని రామలక్ష్మి, ఉపాధ్యక్షుడు గుడివాడ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి జాయింట్ ఎల్‌పీఎం సమస్య


ముదినేపల్లి, ఫిబ్రవరి 8 : భూముల రీ సర్వేలో నమోదైన జాయింట్ ఎల్‌పీఎంల వల్ల రైతులకు ఎదురైన సమస్యలను రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి తీసుకెళ్లినట్టు కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తెలిపారు. జాయింట్ ఎల్‌పీఎంల వల్ల వరి సాగు భూముల రైతులే కాక, చేపల చెరువుల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయంతోపాటు ఎల్‌పీఎంలను సబ్ డివిజన్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. జాయింట్ ఎల్‌పీఎంల వల్ల ఉమ్మడిగా చేపల చెరువులు తవ్వుకున్న రైతులు, తమ భూమిని అమ్ముకునేందుకు రిజిస్ట్రేషన్లు జరగడం లేదన్న విషయాన్ని మంత్రికి వివరించి, ప్రతీ రైతుకు తమ భూములకు ప్రత్యేకంగా ఎల్‌పీఎం నంబరు ఇవ్వాలని కోరారు. దీనిపై చర్యలు తీసుకుని రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 8:నూజివీడు పట్టణంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు నూజివీడు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఓ.దుర్గారావు తెలిపారు. పట్టణంలోని గొడుగువారిగూడెం, కౌన్సిలర్ నాగమణి ఇంటి బజారులలో 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు.

బడ్జెట్‌పై ప్రజా వాయిస్

అభివృద్ధికి చోటేది ?



ముదినేపల్లి : రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశాజనకంగా లేదని, అభివృద్ధికి చోటులేదు. ఎన్నికల ముందు జగన్ ప్రభుత్వ బడ్జెట్ ప్రజారంజకంగా ఉంటుందని పేద, మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగులు ఊహించారని కానీ బడ్జెట్ అన్నివర్గాలకు తీవ్ర నిరాశ కలిగించింది. యువత ఉపాధికి ఎటువంటి కేటాయింపులు లేవు.

\- బాబ్జీ, పీసీసీ సభ్యుడు

ఇది అంకెల గారడీ బడ్జెట్

చాట్రాయి : ఆర్థిక మంత్రి బుగ్గన అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ అంకెల గారడీ మాత్రమే అని ఈ బడ్జెట్ వల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగం ఉండదు. రూ 1.20 లక్షల కోట్లు అప్పులే ఆధారంగా బడ్జెట్ ప్రవేశ పెట్టడం ఆందోళన కలిగించే విషయం. ఫలితంగా పేద మధ్యతరగతి ప్రజల జీవనం అస్తవ్యస్తం అవుతుంది.

\- మందపాటి బసవారెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి

వ్యవసాయానికి కేటాయింపుల తగ్గింపు తగదు



చాట్రాయి/ముసునూరు :బడ్జెట్‌లో వ్యవసాయానికి కేటాయింపుల తగ్గించటం అన్యాయం. గత ఏడాది కంటే రూ.164 కోట్లు కేటాయింపులు తగ్గించడం చూస్తే ఈ ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదని అర్థమవు తుంది. రాష్ట్రంలో ఈఏడాది అనావృష్టి వల్ల ఖరీఫ్‌లో 27 లక్షల ఎకరాలు, రబీలో 30 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయలేదు. ఫలితంగా రైతులు అప్పులపాలయ్యారు.

\- రాయంకుల లక్ష్మణరావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి


ముదినేపల్లి వి.కన్వెన్షన్ హాలు వద్ద ఆశా వర్కర్లు, చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఆశా కార్యకర్తలు, మండవల్లి ఫంక్షన్ హాల్ వద్దకు తరలించిన ఇతర జిల్లాల ఆశావర్కర్లు, కలిదిండిలో నిర్బంధించిన ఆశా వర్కర్లు

ఆశా వర్కర్ల నిర్బంధం

- చలో విజయవాడకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- పోలీస్ స్టేషన్లకు తరలింపు.. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం

ముదినేపల్లి, ఫిబ్రవరి 8 : తమ డిమాండ్ల పరిష్కారం కోసం గురువారం ఆశావర్కర్లు చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ముదినేపల్లిలో పోలీసులు నిర్బంధించారు. మండలంలోని కొంతమంది ఆశా వర్కర్లను ముందస్తుగానే గృహనిర్బంధం చేయగా, ఇతర జిల్లాల నుంచి విజయవాడ పలు వాహనాలు ఆర్టీసీ బస్సుల్లో వెళ్తున్న ఆశా వర్కర్లను ముదినేపల్లి మండలంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్దే పోలీసులు తనిఖీలు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆర్టీసీ బస్సులు, ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలను ముదినేపల్లి ఏఎస్‌ఐ పద్మజ దత్తు, హెచ్‌సీ ఎస్.వి.రామారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు తనిఖీలు నిర్వహించి అడ్డుకున్నారు. ఒక బస్సులో విజయనగరం, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 50 మంది ఆశా వర్కర్లను ముదినేపల్లిలోని వి.కన్వెన్షన్ హాలుకు తరలించి పోలీసుల అదుపులో ఉంచారు. మధ్యాహ్నం మూడు గంటలకు తిరిగి బస్సులో ఏలూరుకు పంపించారు.

- చాట్రాయి : విజయవాడలో జరిగే ధర్నాకు వెళుతున్న చాట్రాయి, చింతలపూడి మండలాల ఆశా వర్కర్లు 40 మందిని గురువారం పోలీసులు అదుపులోకి తీసుకొని చాట్రాయి స్టేషన్‌కు తరలించారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఎదుట స్టేషన్ ఎదుట ఆశా వర్కర్లు ఆందోళన చేశారు. కార్యక్రమంలో చాట్రాయి, చింతలపూడి మండలాల ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు పుల్లమ్మ, యురేనికా, పుష్పవాణి, అనసూర్య పాల్గొన్నారు.
- మండవల్లి : చలో విజయవాడకు విచ్చేస్తున్న ఇతర జిల్లాల ఆశావర్కర్లను బుధవారం రాత్రి మండవల్లి మండలంలోని పలు ప్రాంతాలకు తరలించారు. అర్ధరాత్రి దౌర్జన్యంగా బస్సులు ఎక్కించి గుర్తుతెలియని ప్రాంతాలకు చీకటి మాటున తమను తరలించడం పట్ల ఆశావర్కర్లు తీవ్ర ఆగ్రహాలు వ్యక్తం చేశారు. విజయనగరం, నెల్లూరు జిల్లాల నుంచి బస్సుల్లో ఆశావర్కర్లను మండవల్లి సమ్మెకు శుభం ఫంక్షన్ హాల్లో కొందరిని, భైరవపట్నం సమీపంలోని సోమనాద్రిపురం అగ్రహారంలో మరికొంతమంది ఆశావర్కర్లను నిర్బంధించారు. అనంతరం గురువారం మధ్యాహ్నం నుంచి బస్సు ఎక్కించి ఆయా ప్రాంతాలకు తిరుగు ముఖం పట్టే రీతిలో తరలించారు.
- కలిదిండి : వైజాగ్, నెల్లూరు జిల్లాలకు చెందిన ఆశా వర్కర్లను శుక్రవారం కలిదిండి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. ఆయా జిల్లాల నుంచి విజయవాడలో తలపెట్టిన ధర్నాకు వెళ్లగా వారిని బస్సులో కలిదిండి పోలీస్‌స్టేషన్‌కు తరలించారని సుమారు 150 మంది ఆశా వర్కర్లను కొంతసేపు ఉంచి తిరిగి వారిని వైజాగ్, నెల్లూరు జిల్లాలకు పంపించామని ఎస్‌ఐ ప్రియకుమార్ తెలిపారు.
- ముసునూరు : ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల పరిధిలో ఉన్న 64 మంది ఆశావర్కర్లకు పోలీసులు ముందస్తుగా నోటీసులు జారీ చేశారు. ఎస్‌ఐ పి.వాసు ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజాము నుంచి గ్రామాల శివారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ఎక్కడికక్కడ ఆశావర్కర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. వైసీపీ ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని అక్రమంగా ఆరెస్టులు చేయడంపై ఆశాలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదుపులోకి తీసుకున్న ఆశావర్కర్లను సాయంత్రం పోలీసులు వదిలివేశారు.
- నూజివీడు టౌన్ : ఆశాలకు కనీసవేతనం అమలు చేయాలని, ప్రభుత్వ పథకాలను వర్తింప చేయాలని సీఐటీయూ నూజివీడు అధ్యక్షుడు ఎస్‌ఆర్ హనుమాన్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న ఆశాలను నూజివీడు పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని సారథి ఇంజినీరింగ్ కళాశాలకు తరలించిన నేపథ్యంలో ఆశావర్కర్లకు సీఐటీయూ, ఏపీ రైతు సంఘం నాయకులు నైతిక మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆశాలకు కనీసవేతనం అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్ యూనియన్ నాయకురాలు నవీన, కనకదుర్గ పాల్గొన్నారు. నూజివీడు సీఐటీయూ కార్యదర్శి జి.రాజుకు నూజివీడు పట్టణ పోలీసులు నోటీసులు జారీచేసి సీఐటీయూ కార్యాలయంలోనే ఆయనను నిర్బంధంలో ఉంచారు.


పోలీసుల నిర్బంధంలో రాజు


చిత్తపూరు, పేరూరు, రాచపట్నం గ్రామాల్లో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు

వైసీపీ పాలనలో పన్నుల బాదుడు

- టీడీపీ నూజివీడు ఇన్‌చార్జి ముద్దరబోయిన విమర్శ

చాట్రాయి, ఫిబ్రవరి 8: వైసీపీ అరాచకపాలనకు స్వస్తి చెప్పాలని, వైసీపీ సంక్షేమం ముసుగులో ప్రజలపై విపరీతంగా పన్నులు భారం మోపిందని టీడీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. చిత్తపూరులో గురువారం సాయంత్రం 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ మేనిఫెస్టోతో వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు. టీడీపీ నాయకులు పలగాని దుర్గారావు, నోబుల్ రెడ్డి, తల్లాడ శ్రీనివాసరావు, బుచ్చిబాబు, సంగీతరావు, అత్తులూరి శ్రీనివాసరావు, దామెర చిట్టిబాబు, రామదాసు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలి : కొడాలి వినోద్

ముదినేపల్లి, ఫిబ్రవరి 8 : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ-జనసేన కూటమిని గెలిపించాల్సిన అవసరం ఉందని టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జి కొడాలి వినోద్ అన్నారు. గురువారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పేరూరు, తేరగూడెం గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాకరం-పేరూరు రహదారి, తేరగూడెం రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడం, పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్‌పై వంతెన కూలిపోయి మూడేళ్లు గడిచినా కొత్తవంతెన నిర్మాణం చేపట్టకపోవడం దారుణమని విమర్శించారు. పార్టీ నాయకులు జాస్తి రాజా, పంతగాని సురేష్, బొంగు రవికుమార్, ఈడే సుధాకర్, యర్రా రాంబాబు, సునీత, బొమ్మినంపాడు సర్పంచ్ దారం సుధ, కందేపి పద్మ పాల్గొన్నారు.

రాచపట్నంలో 'భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం'

కైకలూరు, ఫిబ్రవరి 8: రానున్న ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తే ఆరు రకాల సంక్షేమ పథకాలు ప్రజలకు వర్తిస్తాయని టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు అన్నారు. గురువారం రాచపట్నంలో బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతోమేలు చేస్తాయని వీటిపట్ల అవగాహనతో టీడీపీకి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. భవిష్యత్ గ్యారెంటీ పత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, పరసా ఏడుకొండలు, పార్టీ నాయకులు భట్రాజు రాజేష్, వీరబత్తిన సుధ తదితరులు పాల్గొన్నారు.

అరాచకపాలనకు స్వస్తి చెప్పాలి : కామినేని


నర్సాయిపాలెం ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కామినేని

కైకలూరు, ఫిబ్రవరి 8: రాష్ట్రంలో అరాచకపాలనకు స్వస్తి పలకాలని, లేకుంటే రానున్న రోజుల్లో రాష్ట్రం అభివృద్ధిలో పూర్తిగా కుంటుపడుతుందని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ విమర్శించారు. గురువారం కైకలూరు మండలం నర్సాయిపాలెం, ఆలపాడు గ్రామాల్లో ఆత్మీయ సభలను నిర్వహించారు. గ్రామాల్లో పూలవర్షం కురిపిస్తూ హారతులిస్తూ కామినేని స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కలిసి అరాచకపాలనపై పోరాటం చేయాలని రానున్న ఎన్నికల్లో మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు. వైసీపీ పాలనలో ప్రశాంతమైన కైకలూరు నియోజకవర్గంలో అక్రమ కేసులు పెట్టి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు పూల రామచంద్రరావు, బలే ఏసురాజు, పేజీఎస్ మాల్యాద్రి, బీకేఎం నాని, ఆలపాడు మాజీ సర్పంచ్ సుందర రాధాకృష్ణ, బీసీ మాజీ చైర్మన్ కృష్ణంరాజు, జనసేన పార్టీ నాయకుడు కొల్లి వరప్రసాద్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఫ్రూట్‌స్టాల్ ఏర్పాటు


ఫ్రూట్ స్టాల్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ చంద్రశేఖర్

నూజివీడు, ఫిబ్రవరి 8:నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వాషింగ్ మెషీన్, ఫ్రూట్ స్టాల్‌ను నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్ లాంఛనంగా ఆవిష్కరించారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలో హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో కె3 గరల్స్ హాస్టల్ బ్లాక్‌లో దివ్యాంగులైన విద్యార్థినిల కోసం వాషింగ్‌మెషీన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో పాటు విద్యార్థినిలకు పౌష్టికాహారం అందుబాటులో ఉంచేందుకు అనుగుణంగా హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోనే ఈ ఫ్రూట్స్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా, డైరెక్టర్ చంద్రశేఖర్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ వెంకట్రావు, శ్రవంతి, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రసిడెంట్ బ్రహ్మాస్వాములు, చీఫ్‌వార్డెన్ లక్ష్మణరావు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సలీమ్‌బాబు, మధు, రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న డ్వామా పీడీ రాము

కలిదిండి, ఫిబ్రవరి 8 : ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.రాము హెచ్చరించారు. గురువారం కలిదిండి స్త్రీ శక్తి భవనం ఆవరణంలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు వలస వెళ్లకుండా ఉండాలంటే వారికి ఉపాధి పనులు సమృద్ధిగా కల్పించాలన్నారు. ఈ తనిఖీల్లో లోపాలు గుర్తించి రూ.10,226 రికవరీ చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీడీవో దినతేజ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో ఆనంద్, ఈవోపీఆర్‌డీ వై.రాజారావు పాల్గొన్నారు.

సీపీ సీడ్స్ డీఎం అనుమానాస్పద మృతి


వర్సిట్ జంకియో (ఫైల్)

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 8: నూజివీడు మండలం మీర్జాపురం గ్రామపరిధిలోని సీపీ సీడ్స్ కంపెనీలో డీఎంగా పనిచేస్తున్న థాయ్‌లాండ్ వర్సిట్ జంకియో(45) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గురువారం సీడ్స్ కంపెనీలో మీటింగ్ సమయంలో బయటకు వచ్చిన ఆయన కార్యాలయపు పైభాగంలోని సెకండ్ ఫ్లోర్ పైభాగంలో గల వాష్ రూమ్‌లో ఉన్న ఓపెన్ ఏరియాకు వెళ్లి అక్కడి నుంచి కిందికి పడిపోవడంతో తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. క్షతగాత్రుడిని నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడిది థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌గా కంపెనీ వర్గాలు తెలిపాయి. సీపీ సీడ్ డీఎం మృతిపై నూజివీడు డీఎస్పీ ఈ.అశోక్‌కుమార్‌గౌడ్ నూజివీడు రూరల్ ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్‌ఐ తెలిపారు.

26నుంచి సిలువగట్టు పుణ్యక్షేత్రం తిరునాళ్లు


తిరునాళ్ల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నూజివీడు, ఫిబ్రవరి 8 : సిలువగట్టు పుణ్యక్షేత్రం తిరునాళ్ళను ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు నూజివీడు వికార్ ఫారెన్ టౌన్ విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ లాం జయరాజ్ తెలిపారు. గురువారం సిలువగట్టు పుణ్యక్షేత్ర తిరునాళ్ళ పోస్టర్‌ను లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు పరిసర ప్రాంత ప్రజలు ఎంతో పవిత్రమైనదిగా భావించే సిలువగట్టు పుణ్యక్షేత్రం తిరునాళ్ళను మతాలకు అతీతంగా పాల్గొని సిలువనాథుని దీవెనలు పొందాలన్నారు. కార్యక్రమంలో సిలువగట్టు పుణ్యక్షేత్రం రెక్టార్ రెవరెండ్ ఫాదర్ గొర్రుముచ్చు జోసఫ్, రెవరెండ్ ఫాదర్ పెయ్యల మరియదాసు, సిస్టర్ చిన్నమ్మ, ఉత్సవ కమిటీ పెద్దలు, టౌన్, నెహ్రూపేట విచారణ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ పర్యటన

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 8: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ శుక్రవారం మధ్యాహ్నం 11.50 గంటలకు కైకలూరు మండలం రాచపట్నం రానున్నారు. ఆ గ్రామంలో ఎస్సీ కుటుంబానికి చెందిన భూమికి సంబంధించి ఆక్రమణ పై విచారణ జరుపుతారు. అనంతరం రెండు గంటలకు అక్కడి నుంచి బయల్దేరి విజయవాడ వెళతారు.

దాత సాయంతో శ్మశానవాటికలో అభివృద్ధి పనులు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 8 : సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్న ఆగిరిపల్లి శ్మశానవాటికలో ప్రభుత్వ వైద్యులు యండూరి ప్రణీత్ చొరవతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. సంప్రదాయం ప్రకారం శవదహనం అనంతరం నిర్వహించే కార్యక్రమాలకు ఎటువంటి సౌకర్యాలు లేవు. దాత యండూరి ప్రణీత్ తన తల్లిదండ్రులు జగ్గయ్య, కుమారి జ్ఞాపకార్థం శ్మశాన వాటిక అభివృద్ధి నిమిత్తం 24 గంటల నీటిసదుపాయం, కర్మలు చేసుకునేందుకు చెట్టుచుట్టూ సిమెంట్ పల్లెం, అస్థికలు భద్రపరచుకునేందుకు ఆరు గదుల లాకరు, కార్యక్రమాలకు షెడ్డు, నీటి పంపులు ఏర్పాటు చేశారు.

వైసీపీకి ఓటమి భయంతోనే ఫేక్ ఫొటోల ప్రచారం

కలిదిండి, ఫిబ్రవరి 8 :వైసీపీ నాయకులు ఓటమి భయంతోనే చంద్రబాబు ఫేక్ ఫొటోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు వేంపాటి ప్రవీణ్ అన్నారు. గురువారం ఆరుతెగలపాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా వైసీపీ దుష్ట పరిపాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. మార్ఫింగ్ ఫొటోలతో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వైసీపీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

'ప్రతి ఇంటికి కుళాయి సౌకర్యం కల్పించాలి'


సమావేశంలో మాట్లాడుతున్న దేశిరెడ్డి

చాట్రాయి, ఫిబ్రవరి 8: జల్‌జీవన్ మిషన్ నిధులు భారీగా మంజూరైనందున ప్రతిఇంటికి మంచినీటి కుళాయి ఇవ్వటానికి అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి కోరారు. చాట్రాయి మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన గురువారం జరిగింది. పలు శాఖల అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో రైతు గ్రూపులకు 40 శాతం సబ్సిడీపై పురుగు మందుల పిచికారీ, డ్రోన్లు అందజేస్తామని, మిచౌంగ్ తుఫాన్ నష్ట పరిహారం ఈ నెలాఖరుకు విడుదల అవుతుందని, నాడు-నేడు ద్వారా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు రూ.4.48 కోట్లతో అభివృద్ధి చేశామని, జగనన్న కాలనీలకు 24 గంటలు విద్యుత్ సరఫరాకు పనులు జరుగుతున్నాయని, మండలంలో 13,161 కుటుంబాలకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్నామని, పది గ్రామ సచివాలయ నూతన భవనాల నిర్మాణం పూర్తి కాగా మిగిలిన ఎనిమిది పలు దశల్లో ఉన్నాయని వివరించారు. ఎంపీడీవో మంగాకుమారి, తహసీల్దార్ మహ్మద్ మసూద్‌అలీ, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసులరెడ్డి, వైస్ ఎంపీపీలు సుబ్బారెడ్డి, జగన్మోహనరావు ఎంపీటీసీలు సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.

చాట్రాయి తహసీల్దార్‌గా మహ్మద్ మసూద్‌అలీ



చాట్రాయి, ఫిబ్రవరి 8: చాట్రాయి నూతన తహసీల్దార్‌గా మహ్మద్ మసూద్ అలీ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్ నుంచి ఆయన ఇక్కడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల విధులు, భూముల రీసర్వేకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందని, అందరి సహకారంతో ప్రజలకు సత్వరమే సేవలు అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని అన్నారు.

నూజివీడు తహసీల్దార్‌గా విశ్వనాథశాస్త్రులు

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 8: నూజివీడు తహసీల్దార్‌గా విశ్వనాథశాస్త్రులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు నూజివీడు తహసీల్దార్‌గా పనిచేస్తున్న డి.ఎస్ యల్లారావు అమలాపురం సివిల్ సప్లైస్ డీఎంగా బదిలీ కాగా ఆయన స్థానంలో కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు నిర్వర్తిస్తున్న విశ్వనాథశాస్త్రులను నూజివీడుకు బదిలీ చేశారు.

నేడు ఆగిరిపల్లి మండల పరిషత్ సమావేశం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 8 :ఆగిరిపల్లి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం కార్యాలయ సభామందిరంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ గోళ్ళ అనూష అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో శామ్యూల్ తెలిపారు. సమావేశానికి మండలపరిధిలోని ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఇతర ఆహ్వానితులు హాజరు కావాలన్నారు. పలు ప్రభుత్వ శాఖల, మండలస్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

కాలిబాట వంతెన ప్రమాదకరం


నాయుడు చెరువు వద్ద రెయిలింగ్ ఊడిన కాలిబాట వంతెన

ముదినేపల్లి, ఫిబ్రవరి 8 : ముదినేపల్లి మండలం దాకరం-నాయుడు చెరువు గ్రామాల మధ్య పోల్‌రాజ్ ప్రధాన కాల్వపై ఉన్న కాలినడక పక్కా వంతెన ప్రమాదకరంగా ఉంది. వంతెన బీటలు వారడమే కాక, రెయిలింగ్స్ కూడ విరిగిపోయింది. వేలాడుతున్న రెయిలింగ్స్ పడిపోకుండా గ్రామస్థులు తాళ్లతో కట్టుకున్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం పోల్‌రాజ్ కెనాల్‌కు అవతలి వైపున ఉన్న దాకరం శివారు నాయుడు చెరువు గ్రామస్థులకు కాలిబాట సౌకర్యం కోసం ఈ చిన్న వంతెనను నిర్మించారు. కాల్వలో తెరచాప కలిగిన పడవలు వెళ్లే విధంగా వంతెనపై కదిలే విధంగా ఇనుప ప్లేటును ఏర్పాటు చేశారు. ఆ ప్లేటు కూడా పూర్తిగా తుప్పు పట్టిపాడైపోవడంతో గ్రామస్థులే దానిపై సిమెంట్ కాంక్రీట్ వేసుకుని నడుస్తున్నారు. వంతెన శ్లాబు పాడైపోవ డంతో ప్రమాదాలు జరుగుతాయే మోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు వంతెనను దాటేందుకు భయపడుతున్నారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఆ వంతెన నిర్వహణ తమకు సంబంధం లేదని చెబుతుండడంతో బాగు చేసే బాధ్యత ఎవరిదన్నది ప్రశ్నార్థకంగానే మిగిలింది.